# తానా పత్రిక

## Telugu Association of North America

❖ Volume - 30 ❖ Issue - 5 ❖ March 2023







# We congratulate

# TANA

**on it's**

**Successful completion of**

# 22nd National Conference

A real estate investment firm that prides itself on expanding your investment portfolio while standing firm on our commitment to grow with you.



ilan™

***Chowdary 'Charlie' Yalamanchili, President***

**www.ilaninvestments.com • charlie.yalamanchili@ilaninvestments.com**

**(281) 444-1585 Phone • (832) 415-0333 Fax**

**4420 Cypress Creek Parkway • Houston, TX 77068**

EQUAL HOUSING OPPORTUNITY

# TELUGU ASSOCIATION OF NORTH AMERICA

A 501(c)(3) Certified Nonprofit Organization - Tax ID - 36-3060732
26233 Taft RD, Novi, MI 48374

# ఉత్తర అమెరికా తెలుగు సంఘము

*Our Mission*

**"To identify and address social, cultural and educational needs of North American Telugu Community in particular and Telugu people in general"**


Volume-30 Issue-5
March 2023


*


*Editor*
**Sai Brahmanandam Gorti**
gorthib@gmail.com

*Associate Editor*
**Naveen Vasireddy** (India)
kathanaveen@gmail.com


*

The opinions expressed in TANA Patrika belong to the individual authors and do not necessarily reflect those of TANA or the Editorial Board.




***President***
**Anjaiah Chowdary Lavu**
(770) 235-2709; president@tana.org

***Executive Vice President***
**Niranjan Srungavarapu**
(248) 342-6872; evp@tana.org

***Immediate Past President***
**Jayasekhar Talluri**
(631) 523-1999; jaytalluri@yahoo.com

***Secretary***
**Sateesh Vemuri**
(925) 989-4536; secretary@tana.org

***Treasurer***
**Ashok Babu Kolla**
(270) 293-0003; treasurer@tana.org

***Joint Secretary***
**Murali Talluri**
(216) 255-7066; mthalluri@gmail.com

***Joint Treasurer***
**Bharath Maddineni**
(678) 772-1681; bmaddine@gmail.com

***Community Services Coordinator***
**Venkata (Raja) Kasukurthi**
(201) 270-8648; vkasukurthi@gmail.com

***Cultural Services Coordinator***
**Sirisha Tunuguntla**
(904) 294-5655; siri.usa15@gmail.com

***Women Services Coordinator***
**Uma Katiki**

***International Coordinator***
**Venkata Hiteshwar Vadlamudi**
hiteshvadlamudi@gmail.com

***Sports Coordinator***
**Shashank Yarlagadda**
6013450543; yshashi8@gmail.com

***Councilor-at-large***
**Lokesh Naidu Konidala**
(972) 853-7462; lokeshnaidu2000@gmail.com

***Chairman, Board of Directors***
**Dr. Hanumaiah Bandla**
(248) 788-9522

***Chairman, Foundation***
**Venkataramana Yarlagadda**
(601) 212-3298

***Regional Coordinators***

**Nagamalleswara Panchumarthi**
Appalachian
**Srinivas Vuyyuru**
Capital
**Sateesh Kommana**
DFW
**Sunil Koganti**
Mid-Atlantic
**Hanumantha Cherukuri**
Midwest
**Pradeep Kumar Gaddam**
New England
**Vamsi Vasireddy**
New Jersey
**Dilipkumar Musunuru**
New York; 5167387994
**Srinivas Gogineni**
North
**Sai Bollineni**
North Central
**Padma Bhogavalli**
North West
**Ram Thota**
Northern CA; (408) 393-6782
**Ravi Vadlamudi**
Ohio Valley
**Sarit Kommineni**
Rocky Mountains
**Kishore Yarlagadda**
South Central
**Venkata Ramana Meesala**
South East
**Ratna Gummadi**
South West; (713) 876-7919
**Prathap Cherukuri**
Southern CA




ముఖచిత్రం
ఆస్కార్ విజేతలు




తానా 23వ మహాసభల
కిక్-ఆఫ్ వేడుక
14





కలిసిరాని రీమేకులు...
రీమిక్సులు
52





ఆస్కార్ విజేతలు
18





వంశీ-ఏవో కొన్ని గుర్తుకొస్తున్నాయి
ఆలాపన - 3
36


# ఇంకా...


Editorial ... 05
TANA President's Message ... 06
TANA Executive Committee ... 08
TANA Regional Coordinators ... 09
TANA Board of Directors ... 10
TANA Foundation ... 11
TANA Foundation Donation Form ... 12
తానా-మంచి పుస్తకం పిల్లల
కథల పోటీ ప్రకటన ... 20
తానా నవలల పోటీ-2023 ప్రకటన ... 21

కథ
ధనుర్మాసంలో జరిగిందా మహత్యం!
- గోపిని కరుణాకర్ ... 22
Appeal to Telugu Diaspora ... 46
కవితలు
ఏకాంతం
రిలే రేసు
- చాగంటి తులసి ... 50
కలిసిరాని రీమేకులు... రీమిక్సులు
- శ్రీ అట్లూరి & జలపతి ... 52



## సంపాదకీయం

తానా పత్రిక పాఠకులందరికీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు!

ఈ ఆధునిక జీవితంలో పండగలు ఫోన్లకీ, ఇంటర్నెట్‌కి పరిమితం అయిపోయాయి.

ఒకరు ఇంకొకర్ని పలకరించి ఉగాది శుభాకాంక్షలు చెప్పే కాలానికి కాలం చెల్లింది.

వేళ్ల మీదనే ప్రపంచమంతా నడుస్తోంది.

కంటి పలకరింపు, చేతి స్పర్శ అందించే అనుభూతి వేరు.

ఉన్నంతలోనే తృప్తిపడే స్థాయికి వచ్చేసింది ప్రపంచం.

ఈ నెలలో తెలుగువారికి మరో చెప్పుకోదగ్గ సందర్భం RRR ఆస్కార్ పండగ. తెలుగువాళ్లు గర్వించదగ్గ విషయం. ఆస్కార్ అవార్డుల ఎంపిక భిన్నంగా వుంటుంది. ఎన్నో అవధులు దాటుకుంటూ చివరకి ఆస్కార్ దక్కించుకున్న 'నాటు నాటు...' పాట తెలుగు సినిమాకి వెలకట్టలేని పెద్ద నోటు. విజేతలకి అభినందనలు!

కేవలం పాట దగ్గరే ఆగిపోకుండా ఒక తెలుగు సినిమాకి ఆస్కార్ వచ్చే రోజు రావాలని ఆశిద్దాం.

ఇదే కాకుండా ***The Elephant Whispers*** అనే డాక్యుమెంటరీ సినిమాకి ఆస్కార్ అవార్డు రావడం మరో చెప్పుకోదగ్గ విశేషం. దాదాపు అయిదేళ్ల కృషికి దక్కిన ఫలితం ఇది. ఈ చిత్ర నిర్మాత, దర్శకులకి ఇది రెండో ఆస్కార్ అవార్డు. ఇంకా ప్రత్యేకం ఏవిటంటే గునీత్ మోంగా, కార్తికి గొంజాల్వెస్ అనే ఇద్దరు మహిళల కృషికి దక్కిన గౌరవం.

ఈ ఏడాది జూలై మొదటివారంలో 23వ తానా మహాసభలు జరుగుతాయి. ప్రతీ మహాసభలకీ ప్రత్యేక (సావనీరు) సంచిక వస్తుంది. ఈ సంచికకి కథలూ, వ్యాసాలూ వంటివి తెలుగు రచయితల నుండి ఆహ్వానిస్తున్నాము.

అమెరికాలోనున్న తెలుగువారందరూ ఈ సభల్లో పాల్గొంటారని ఆశిస్తూ...

అభినందనలతో...

సాయి బ్రహ్మానందం



# President's Message

**ANJAIAH CHOWDARY LAVU**
***President - 2021-23***

తానాపత్రిక సభ్యులకీ, కార్యకర్తలకీ, పాఠకులకీ అందరికీ శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు!

ఈ కొత్త సంవత్సరం కొంగ్రొత్త ఆశలు, ఆశయాలు చిగురించేలా సంతోషంగా, ఆనందంగా గడపాలని ఆశిస్తున్నాను.

ఈ నెలలో మిడి అట్లాంటిక్ రీజియన్‌లోనూ, షికాగోలోనూ అంతర్జాతీయ మహిళాదినోత్సవం ఘనంగా నిర్వహించాము. అలాగే కాలిఫోర్నియా శాన్ హోసేలో హోలీ ఫెస్ట్ ఘనంగా జరుపుకున్నాము.

ఈ మార్చి నెల మొదటి వారంలో నార్త్ వెస్ట్ వైపునున్న పోర్ట్‌లాండ్ నగరంలో మూడు విడతల సహాయ కార్యక్రమాలు **Salvation Army** తరపున నిర్వహించాము. ఎంతోమంది బీదవారికి ఈ కార్యక్రమం ద్వారా సహాయం అందింది.

ఈ ఏడాది జూలై మొదటివారంలో 23వ తానా మహాసభలు ఫిలడెల్ఫియా నగరంలో నిర్వహించడానికి పెద్ద ఎత్తున సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ సభలకి ఫండ్‌రైజర్ కార్యక్రమాలు- డెలావేర్, హారిస్‌బర్గ్, డిట్రాయిట్, కొలంబస్, న్యూజెర్సీ నగరాల్లో నిర్వహించాము. వీటికి ఎంతోమంది హాజరయ్యి తానా ఎడల తమ గౌరవాన్ని తెలియపరచుకున్నారు.

ఈ నెలలో తెలుగువారు గర్వించదగ్గ శుభ పరిణామం- ఆస్కార్ వేడుకలో తెలుగు పాటకి అవార్డు రావడం. ఇది ప్రతీ తెలుగువాడూ గర్వించదగ్గ విషయం. ఈ అవార్డు అందుకున్నా కీరవాణి, చంద్రబోస్, రాజమౌళిలకి ప్రత్యేక అభినందనలు.

ఇదే కాకుండా *The Elephant Whispers* అనే డాక్యుమెంటరీ సినిమాకి ఆస్కార్ అవార్డు రావడం భారతీయులందరికీ గర్వకారణం. సుమారు అయిదేళ్ల కృషితో నిర్మించిన డాక్యుమెంటరీ ఇది. ఈ చిత్ర నిర్మాత, దర్శకులకి ఇది రెండో ఆస్కార్ అవార్డు.

ఈ చిత్ర నిర్దేశకులు గునీత్ మోంగా, కార్తికీ గొంజాల్వెస్‌లకి ప్రత్యేక అభినందనలు.

అట్లాంటాలో తానా తరపున ప్రత్యేక అభినందన కార్యక్రమం నిర్వహించి ఆస్కార్ అవార్డ్ విజేతలైన కీరవాణి, చంద్రబోస్‌లను సత్కరించాము.

తానా ఫౌండేషన్ తరపున *Healthy Future* అనే కార్యక్రమాన్ని హైద్రాబాదులో ఘనంగా నిర్వహించాము.

అలాగే తానా సాంస్కృతిక సిరులు తరపున కూడా విశేషమైన కార్యక్రమాలు ప్రతి నెలా నిర్వహిస్తున్నాము.

ఈ ఏడాది జూలై 7, 8, 9 తేదీల్లో నిర్వహిస్తున్న తానా 23వ మహాసభలకి మీరందరూ విచ్చేసి ఈ సభలను దిగ్విజయం చెయ్యాలని మనసారా ఆహ్వానిస్తున్నాను.

అందరికీ పేరు పేరునా ఇదే నా ప్రత్యేక ఆహ్వానం.

మీ

**అంజయ్య చౌదరి లావు**

# TANA EXECUTIVE COMMITTEE - 2021-2023



**Anjaiah Chowdary Lavu**
*President*



**Niranjan Srungavarapu**
*Executive Vice President*



**Jayasekhar Talluri**
*Past President*



**Sateesh Kumar Vemuri**
*Secretary*



**Ashok Babu Kolla**
*Treasurer*



**Murali Talluri**
*Joint Secretary*



**Bharath Maddineni**
*Joint Treasurer*



**Venkata (Raja) Kasukurthi**
*Community Service Coordinator*



**Sirisha Tunuguntla**
*Cultural Service Coordinator*



**Uma Katiki**
*Women Services Coordinator*



**Lokesh Naidu Konidala**
*Councilor-at-Large*



**Venkata Hiteshwar Vadlamudi**
*International Coordinator*



**Shashank Yarlagadda**
*Sports Coordinator*



**Tagore Mallineni**
*Media Coordinator*



**Srinivas Kukatla**
*Event Coordinator*



**Srinivas Yalavarthy**
*Membership Benefits Coordinator*



**Suresh Kakarla**
*Team Square Chair*



**Dr. Hanumaiah Bandla**
*Chairman*
*Board of Directors*



**Venkataramana Yarlagadda**
*Ex-Officio Member*
*Chairman, TANA Foundation*

# REGIONAL COORDINATORS


**Nagamalleswara Panchumarthi**
*Appalachian*


**Srinivas Vuyyuru**
*Capital*


**Sateesh Kommana**
*DFW*


**Sunil Koganti**
*Mid-Atlantic*


**Hanumantha Cherukuri**
*Midwest*


**Pradeep Kumar Gaddam**
*New England*


**Vamsi Vasireddy**
*New Jersey*


**Dilipkumar Musunuru**
*New York*


**Srinivas Gogineni**
*North*


**Sai Bollineni**
*North Central*


**Padma Bhogavalli**
*North West*


**Ram Thota**
*Northern California*


**Ravichandra Vadlamudi**
*Ohio Valley*


**Sarit Kommineni**
*Rocky Mountains*


**Venkata Ramana Meesala**
*South East*


**Kishore Yarlagadda**
*South Central*


**Ratna Prasad Gummadi**
*South West*


**Prathap Cherukuri**
*Southern California*

# TANA BOARD OF DIRECTORS - 2021-2023

Est. 1977
www.tana.org



**Dr. Hanumaiah Bandla**
*Chairman*



**Murali Vennam**
*Secretary*



**Lakshmi Devineni**
*Treasurer*



**Janardhan Nimmalapudi**
*Director (Non-Donor)*



**Srinivas Lavu**
*Director*



**Dr. Chowdary Jampala**
*Director*



**Dr. Nagendra Srinivas Kodali**
*Director*



**Anjaiah Chowdary Lavu**
*Ex Officio Member*
*President, EC*



**Niranjan Srungavarapu**
*Ex Officio Member*
*Executive Vice President, EC*



**Jayasekhar Talluri**
*Ex Officio Member*
*Past President*



**Sateesh Kumar Vemuri**
*Ex-Officio Member*
*Secretary, EC*



**Ashok Babu Kolla**
*Ex-Officio Member*
*Treasurer, EC*



**Venkataramana Yarlagadda**
*Ex Officio Member*
*Chairman, TANA Foundation*



**Sasikanth Vallepalli**
*Ex Officio Member*
*Secretary, TANA Foundation*



**Srikanth Polavarapu**
*Ex-Officio Member*
*Treasurer, TANA Foundation*

# TANA FOUNDATION 2021-2023


Venkataramana Yarlagadda
*Chairman*


Sasikanth Vallepalli
*Secretary*


Srikanth Polavarapu
*Treasurer*


Ramakanth Koya
*Trustee*


Ravi Samineni
*Trustee*


Viswanath Nayunipati
*Trustee*


Suresh Puttagunta
*Trustee*


Srinivas Chand Gorrepati
*Trustee*


Kiran Gogineni
*Trustee - Non Donor*


Purushotham C Gude
*Trustee - Non Donor*


Vinay Maddineni
*Trustee - Non Donor*


Srinivas Oruganti
*Trustee - Non Donor*


Sumanth Ramsetti
*Trustee*


Vidyadhar Garapati
*Trustee - Donor*


Anjaiah Chowdary Lavu
*Ex-Officio Member*
*President*

# TANA FOUNDATION

*Division of Telugu Association of North America (TANA)*
*A not-for profit organization, Tax ID 36-3060732*

***To Donate or pledge please visit www.tana.org/donate or www.tanafoundation.org/donation or mail this form***

***We make a living by what we get; we make a life by what we give.***

## TANA FOUNDATION DONATION FORM

Name (First, Last): ____________________________________________

Address: ____________________________________________

Email Address:______________________________ Phone:______________________

I would like to sponsor the following:

- Orphanages: US$__________
- Vaaradhi US$__________
- Scholarships ($250 each): US$__________
- Eye Camp ($600)
  (Requires filling the sponsorship form on the web): US$__________
- Cancer Camp ($1500 each): US$__________
- Cleft Lip Surgeries ($250 each): US$__________
- Libraries ($500 each): US$__________
- Other (Specify) ______________________ US$__________

Frequency (Check one) : ☐ One time ☐ Monthly ☐ Yearly

Check Number: ____________________ (Payable to TANA Foundation)

Credit Card Number: ____________________________________________

Billing Address: ____________________________________________

CV Code: ________________

*Please mail the completed form to:*

**TANA Foundation**
**Treasurer**
26233 Taft Road,
Novi, MI 48374.

***For any questions or comments, please send an email to jaytalluri@gmail.com***

ఉత్తర అమెరికా తెలుగు సంఘము

TELUGU ASSOCIATION OF NORTH AMERICA



# TELEHEALTH PLATFORM

## BY BOARD CERTIFIED EXPERT DOCTORS

**CONNECTING PATIENTS WITH DOCTORS ANYWHERE IN THE WORLD**

**EVERY SUNDAY**
**9:00 AM to 11 AM EST || 7:30 PM to 9:30 PM IST**



### Services Available:

- Family Medicine
- Internal Medicine
- Cardiology
- Orthopedics
- Pediatrics
- Psychologist
- Critical Care / Neurocritical Care / Sleep Medicine



Register yourself and join the Zoom call to get advice from expert doctors from USA, UK, INDIA etc.

**Registration Link:**
**www.eglobaldoctors.com**

eGlobalDoctors
Care for better life



## ANJAIAH CHOWDARY LAVU, President

**RAJA KASUKARTHI**
Community Services Coordinator

**BHARATH MADDINENI**
Joint Treasurer

**HITESH VADLAMUDI**
International Coordinator

**VENKAT MEESALA**
SouthEast Regional Coordinator

**SASHIDHAR JASTY**
TANA Cares Chair

**NAGESH DODDAKA**
Visitor Insurance & Medical Services Chair

# ఫిలడెల్ఫియా 23వ తానా మహాసభల కిక్-ఆఫ్ వేడుక

ఉత్తర అమెరికాలో ప్రవాస తెలుగువారికి అలనాటి నుండి ఆసరాగా నిలిచినా లాభాపేక్షలేని సంస్థలలో తానా ప్రధానమైనది. తానా నిర్వహించే కార్యక్రమాలు గురించి తెలుగువారికి ప్రత్యేకంగా ప్రస్తావించ నవసరం లేదు. తెలుగువారి సంస్కృతి, సంప్రదాయా లను గుర్తుకు తెచ్చే ప్రవాస తెలుగువారి పండగ తానా మహాసభలు. ప్రతి రెండేళ్లకు అంగరంగ వైభవంగా జరిగే ఈ వేడుకకు, ప్రపంచాన్ని కుదిపేసిన కోవిడ్ మహమ్మారి కారణంగా 2021లో నభకు అంతరాయం ఏర్పడడంతో, ఈసారి జరగబోయే మహాసభ అందరి దృష్టిని ప్రత్యేకంగా ఆకర్షించనుంది.

అమెరికాలోని డెలావేర్ రాష్ట్రం విల్మింగ్టన్ మరియు పెన్సిల్వేనియాలోని హరిస్‌బర్గ్ నగరాలలో ఫిబ్రవరి 17, 18వ తేదీలలో, తానా అధ్యక్షులు అంజయ్య చౌదరి లావు ఆధ్వర్యంలో, మహాసభల సమన్వయకర్త రవి పొట్లూరి నేతృత్వంలో జులై 7,8,9 తేదిలలో జరగబోయే ప్రతిష్ఠాత్మక తానా ఫిలడెల్ఫియా 23వ మహాసభల కిక్-ఆఫ్ వేడుకకు ఉదార స్వభావం కలిగిన దాతలు ఎందరో హాజరై, 'మేము సైతం అమ్మ లాంటి తానా కోసం' అని వారి వంతు చేయూతనిచ్చి, గొప్ప ఔచిత్యాన్ని చాటుకున్నారు.

ఈ సందర్భంగా అంజయ్య చౌదరి మాట్లాడుతూ తానా ప్రస్థానం, నిర్వహించిన, నిర్వహిస్తున్న వివిధ సేవ కార్యక్రమాలు, ప్రవాస తెలుగువారు కష్టకాలంలో ఉన్నప్పుడు వారికీ భరోసాగా నిలిచినా పలు సందర్భాల గురించి అక్కడికి విచ్చేసిన తానా సభ్యులకు వివరించారు. రవి పొట్లూరి మాట్లాడుతూ తానా మహాసభల యొక్క విశిష్టతను వివరిస్తూ, 22 సంవత్సరాల తరువాత, ఈ సంబరం మన ఫిలడెల్ఫియా ప్రాంతంలో జరగడం మన అందరి






అదృష్టం, దానిని విజయవంతం చేయవలిసిన బాధ్యత అందరి భుజస్కంధాల పైన ఉంది అని అన్నారు. ఈ మహాత్కార్యానికి ముందుకు వచ్చిన దాతలందరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో తానా మహాసభల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవి మందలపు, కార్యదర్శి సతీష్ తుమ్మల, మిడ్ అట్లాంటిక్ ప్రాంత ప్రతినిధి సునీల్ కోగంటి, విల్మింగ్టన్ సిటీ కోఆర్డినేటర్ లక్ష్మణ్












పర్వతనేని, హరిస్‌బర్గ్ సిటీ కోఆర్డినేటర్ వెంకట్ చిమిలి, శ్యామ్‌బాబు వెలువోలు, ఆట మాజీ అధ్యక్షుడు పరమేష్ భీంరెడ్డి, సతీష్ చుండ్రు, వెంకట్ సింగు, కిరణ్ కొత్తపల్లి, హను తిరుమల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమాలలో ఆట, నాట, టాటా, డాటా, హరిస్‌బర్గ్ తెలుగు సంఘం మొదలైన సంస్థల ప్రతినిధులు పలువురు హాజరై తానా మహాసభలకు వారి సంఘీభావం తెలిపారు.


ONE OF A KIND, WORLD-CLASS
VILLA PROJECT AT THE MOST EMERGING
LOCATION, KAPULUPPADA, VISAKHAPATNAM.
JUST 7 KMS FROM IT HUB
₹3.1 cr* onwards
Possession by April 2024
SF 580
62 High-end villas
Villas ranging from 4,002 sq. ft. to 7,435 sq. ft.
11 Acres, 73% Green & open spaces
Tennis, Basket ball, Shuttle courts & Cricket pitch
32,000 sq. ft. clubhouse
Play areas & Outdoor fitness station
*T&C Apply
Scan the code to download our brochure
For more details contact
+91 96903 88888
Kapuluppada, Visakhapatnam
Contact@villaasam.com
Visit www.villaasam.com
VILLAASAM
BY
AUGMENTED REALTY



# చారిత్రక ఘట్టం

## ఊర నాటు... ఆస్కార్ హిట్టు...

***'నే పాడితే లోకమే పాడదా.. నే ఆడితే లోకమే ఆడదా...' పాటలో దమ్ముంటే లోకం పాడుతుంది.. ఆడుతుంది.. ఆ పాట విశ్వ విజేత అవుతుంది. 'నాటు నాటు...' అందుకో ఉదాహరణ. క్లాస్, మాస్ తేడా లేకుండా నాటు బీటు అందరి మనసుల్లోకి చొచ్చుకుపోయింది. తెలుగు పరిశ్రమ తొలి ఆస్కార్ ఆనందాన్ని చవి చూసేలా చేసింది. 'ఆర్ఆర్ఆర్' హీరోలు ఎన్టీఆర్, రామ్‌చరణ్, దర్శకుడు రాజమౌళి, డాల్బీ థియేటర్‌లో ఇతరుల కరతాళ ధ్వనుల మధ్య చిత్ర సంగీతదర్శకుడు కీరవాణి, రచయిత చంద్రబోస్ ఆస్కార్‌ని అందుకున్నారు.***



ఇప్పుడు భారతీయుల గుండెచప్పుడు ఆర్ఆర్ఆర్ లోని నాటు... నాటు... పాట అంటే అతిశయోక్తి కాదేమో. ఈ విజువల్ వండర్‌కు క్రియ దర్శక దిగ్గజం రాజమౌళి అయితే, కర్త, కర్మలు జూనియర్ ఎన్టీఆర్, రామ్‌చరణ్, సంగీత దర్శకుడు ఎమ్ఎమ్ కీరవాణి, గీత రచయిత చంద్రబోస్, గాయకులు రాహుల్ సిప్లిగంజ్, కాలభైరవ, నృత్య దర్శకుడు ప్రేమ్ రక్షిత్ అయ్యారు. ఈ పాట ఇప్పటికే ప్రపంచ సినీ ప్రేక్షకులను ఓలలాడించి, స్టెప్పులు వేయించింది. ఇప్పుడు ఆస్కార్ బరిలో విజయకేతనం ఎగరేసి తెలుగు సినిమా ఖ్యాతిని విశ్వవేదికపై ఘనంగా చాటింది. దీంతోపాటు మరో తమిళ డాక్యుమెంటరీ చిత్రం ది ఎలిఫెంట్ విస్పరర్స్ చిత్రం ఆస్కార్ అవార్డు గెలుచుకుని సత్తా చాటింది.

ఆస్కార్ వేదికపై నాటు నాటు స్టెప్పులు అదిరిపోయాయి. దాదాపు 80 పాటలను పరిశీలించి 15 పాటలను బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగంలో అవార్డు కోసం షార్ట్ లిస్ట్ చేసింది ఆస్కార్ కమిటీ. ఈలోపు ఆర్ఆర్ఆర్ టీమ్ ప్రమోషన్స్‌తో 'నాటు నాటు...' విదేశీయులకు కూడా మరింత చేరువైంది. ఈ క్రమంలోనే జనవరి 24న వెల్లడైన ఆస్కార్ నామినేషన్స్‌లో 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో 'నాటు నాటు...'కు చోటు దక్కింది. 'నాటు నాటు' పాటతో పాటు టెల్ ఇట్ లైక్ ఏ ఉమెన్ చిత్రంలోని 'అప్లాజ్', బ్లాక్‌పాంథర్: వకాండ ఫరెవర్‌లోని 'లిఫ్ట్ మీ అప్', ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్ చిత్రంలోని 'దిస్ ఈజ్ ఏ లైఫ్', టాప్‌గన్: మ్యావరిక్‌లోని 'హోల్డ్ మై హ్యాండ్' పాటలు బరిలో నిలిచాయి. అయితే వీటన్నింటినీ దాటుకుని తెలుగు 'నాటు నాటు' ఆస్కార్ అవార్డును తెచ్చింది. ప్రపంచ సినిమాచరిత్రలో సరికొత్త చరిత్రకు పునాది వేసింది. ఇలా దేశానికి ఆస్కార్ తెచ్చిన తొలి చిత్రంగా, తొలి తెలుగు చిత్రంగా ఆర్ఆర్ఆర్ నిలిచింది.

అలాగే నాన్ ఇంగ్లిష్ పాటల్లో ఆస్కార్ అవార్డు సాధించిన నాలుగో పాటగా 'నాటు నాటు' నిలిచింది. ఇక ఆస్కార్ అవార్డు సాధించిన తొలి తెలుగు వ్యక్తులుగా కీరవాణి, చంద్రబోస్ రికార్డు సృష్టించారు. అలాగే బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో ఆస్కార్ అవార్డు సాధించిన రెండో భారతీయుడుగా కీరవాణి, రెండో గీత రచయితగా చంద్రబోస్ నిలిచారు. 2009లో జరిగిన 81వ ఆస్కార్ అవార్డ్స్‌లో ఇంగ్లిష్ చిత్రం స్లమ్‌డాగ్ మిలియనీర్‌కిగాను 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో ఏఆర్ రెహమాన్, రచయిత గుల్జార్ ఆస్కార్ అవార్డులను అందుకున్నారు.







'నాటు నాటు' పాటను ఉక్రెయిన్‌లో చిత్రీకరించారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ భవన ప్రాంగణంలో ఈ పాటను షూట్ చేశారు. పక్కనే పార్లమెంట్ భవనం కూడా ఉంది. అయితే ఇలాంటి ప్రదేశంలో ఓ సినిమా షూటింగ్ అంటే చాలా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ జెలెన్‌స్కీ ఒకప్పుడు టెలివిజన్ యాక్టర్ అట. ఆర్ట్ గురించి ఆయనకు అవగాహన ఉండటంతో పాటను చిత్రీకరించేందుకు అనుమతి ఇచ్చారు. 'నాటు నాటు...' పాటను 17 రోజుల పాటు షూట్ చేశారు. సెట్స్‌లో ప్రతి రోజూ 150మంది డ్యాన్సర్లు పాల్గొన్నారు. 200మంది సాంకేతిక నిపుణులు ఈ పాట కోసం లొకేషన్‌లో హాజరయ్యారు.

ఇక ఈ పాటలో ప్రత్యేకించి చెప్పుకోవాల్సింది 'హుక్ స్టెప్' గురించి. దాదాపు 80 రకాల స్టెప్స్‌ను కంపోజ్ చేశాక ఈ పాట కొరియోగ్రాఫర్ ప్రేమ్ రక్షిత్ అండ్ టీమ్ ఆ స్టెప్‌ను ఫైనలైజ్ చేశారు. ఈ స్టెప్ కూడా ఊరికే పూర్తి కాలేదు. డ్యాన్స్‌లో మంచి ప్రావీణ్యం ఉన్న ఎన్టీఆర్, రామ్‌చరణ్‌లు 18 టేకులు తీసుకున్నారు. ఎన్టీఆర్, చరణ్‌ల మధ్య సింక్ రావడానికి ఎక్కువ సమయం పట్టిందట. ఇలా వీరందరి కష్టం ఇప్పుడు ఆస్కార్ అవార్డు రూపంలో ఫలించింది.

ఈ పాట కోసం దాదాపు రూ. 15 కోట్లు ఖర్చయింది. నిజానికి ఈ పాటను ముందుగా ఇండియాలోనే షూట్ చేయాలనుకున్నారు. సెట్ అయితే సహజంగా ఉండదని భావించి ఢిల్లీలోని ఎర్రకోట లొకేషన్‌ను అనుకున్నారు. కానీ ఆ సమయానికి వర్షాకాలం కావడంతో ఉక్రెయిన్‌లో చిత్రీకరించారు. ఈ సినిమాకు రాజమౌళి భార్య రమా రాజమౌళి కాస్ట్యూమ్ డిజైనర్‌గా వర్క్ చేశారు.

కీరవాణి, చంద్రబోస్‌లతో పాటు ఆర్ఆర్ఆర్ టీమ్ అంతటికీ తానాపత్రిక అభినందనలు తెలుపుతోంది. ❀

తానా - మంచి పుస్తకం ఆధ్వర్యంలో

# పదేళ్ల లోపు పిల్లల కోసం
# తెలుగులో బొమ్మల కథల పుస్తకాలు - 2023

ఉత్తర అమెరికా తెలుగు సంఘం (TANA) 23వ మహాసభలు 2023 జులై 7, 8, 9 తేదీలలో ఫిలడెల్ఫియా నగరంలో జరగబోతున్నాయి. ఈ సందర్భంగా తానా వివిధ సాహిత్య కార్యక్రమాలు చేపడుతోంది. అందులో భాగంగా బాలసాహిత్యాన్ని ప్రోత్సహించడం కోసం మంచి పుస్తకం (హైదరాబాద్) సంస్థతో కలిసి **పదేళ్ల లోపు పిల్లల కోసం తెలుగులో బొమ్మల కథల పుస్తకాలు – 2023** కి రచనలు ఆహ్వానిస్తోంది.

**పుస్తకం:** పుస్తకం (1/4 క్రౌన్ సైజు, 18×24 సెం.మీ.) ఇన్నర్ టైటిల్ ఇంప్రింట్ పేజీతో సహా 24 పేజీలు (పోర్ట్రేట్ లేదా ల్యాండ్‌స్కేప్‌లో) ఉండాలి, అదనంగా కవర్ పేజీలు ఉంటాయి.

**కథాంశం:** ఒక్కొక్క పేజీలో 10–12 వాక్యాలకు మించి ఉండకూడదు. కథ చదవటానికి సరదాగా, హాయిగా ఉండాలి; తమాషాగా అనిపించాలి. తల్లిదండ్రులు లేదా అన్న, అక్క చిన్న పిల్లలకు చదివి వినిపించేలా కూడా పుస్తకం ఉండవచ్చు. నీతి కథలు, జానపద కథలు, జంతువుల కథలు కాకుండా సమకాలీన వాతావరణం, అంశాలతో కథ ఉండాలి. పిల్లలలో పుస్తకాలు చదివే అలవాటును పెంపొందించేలా పుస్తకం ఉండాలి.

రచనతో పాటు కథ తమ సొంతమని, ఇంతకు ముందు ఏ రూపంగానూ ప్రచురితం కాలేదన్న హామీ పత్రాన్ని జత చేయాలి. కలం పేరు ఉపయోగించే వాళ్లు అసలు పేరుతో హామీ పత్రాన్ని ఇవ్వాలి.

కథ, బొమ్మలు ఒకరే రాయ గీయవచ్చు. లేదా కథ రాసేవాళ్లు, బొమ్మ వేసేవాళ్లు ఒక బృందంగా పని చెయ్యవచ్చు. కథ మాత్రమే రాయగలిగి, బొమ్మలు వేసేవాళ్ల తెలియని వాళ్ల విషయంలో, ఆ కథ ఎంపికైతే బొమ్మలు వేయించే బాధ్యత మేం చేపడతాం.

**ప్రక్రియ:** ఇది 2 దశలలో ఉంటుంది :

**దశ-1:** కథ సారాంశం, నమూనా బొమ్మలు మాకు 2023 జనవరి 15 లోపల అందచెయ్యాలి. ఈ దశలో ఎంపికైన కథలు రెండవ దశలోకి వెళతాయి.

**దశ-2:** ఈ దశకి సుమారు 10 కథా అంశాలను ఎంపిక చేస్తాం. ఒక పుస్తకానికి కథ రాసిన వారికి, బొమ్మలు వేసిన వారికి పదిహేను వేల రూపాయల చొప్పున పారితోషికం ఇస్తాం. ఒకవేళ ఆశించిన స్థాయిలో రచనలు రాకపోతే 10 కంటే తక్కువ కథలను ఎంపిక చేస్తాం. 2023 మార్చి 31 లోపల బొమ్మలతో పూర్తి చేసి, ముద్రణకు సిద్ధంగా ఉన్న పుస్తకాన్ని అందజేయాలి. ఈ పుస్తకాలన్నింటినీ తానా – మంచి పుస్తకం కలిసి 2023 జులై నాటికి ప్రచురిస్తాము. కథ, బొమ్మలపై కాపీరైటు ఆయా రచయితలు, చిత్రకారులకే ఉంటాయి.

* నిర్వాహకుల నిర్ణయాలపై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదు. వివాదాలన్నింటినీ మేరీల్యాండ్ న్యాయపరిధిలో పరిష్కరించుకోవాలి.

రచనలు పంపించవలసిన చిరునామా

**మంచి పుస్తకం, 12-13-439, వీధి నెం. 1, తార్నాక, సికింద్రాబాదు 500017.**

**Email: info@manchipustakam.in**

| లావు అంజయ్య చౌదరి | కన్నెగంటి చంద్ర | జంపాల చౌదరి | కె. సురేష్ |
|---|---|---|---|
| తానా అధ్యక్షులు | తానా ప్రచురణల కమిటీ ఛైర్మన్ | కార్యక్రమ నిర్వాహకులు | మంచి పుస్తకం |

# తానా నవలల పోటీ - 2023

## ఉత్తమ నవలకు 2 లక్షల రూపాయల బహుమతి

ఉత్తర అమెరికా తెలుగు సంఘం – తానా (TANA) ప్రతి రెండేళ్లకు ఒకసారి నిర్వహించే నవలల పోటీని ఈ సంవత్సరం కూడా రెండు లక్షల రూపాయల బహుమతితో కొనసాగించాలని తానా కార్యవర్గం నిర్ణయించింది. 1997 నుంచి మధ్యలో కొంతకాలం విరామంతో తానా నవలల పోటీ నిర్వహిస్తోంది. 2017 నుంచి తానా తిరిగి నిర్వహించిన నవలల పోటీలో బహుమతికి ఎన్నికైన **శప్తభూమి, నీల, ఒంటరి, కొండపొలం, మున్నీటి గీతలు, అర్థనారి** నవలలు సాహితీలోకంలో ఒక కదలికను తీసుకొచ్చాయి. శప్తభూమి నవలకు కేంద్ర సాహిత్య అకాడెమి పురస్కారం లభించింది. కొండపొలం నవల సినిమాగా రూపొందింది. శప్తభూమి, మున్నీటి గీతలు నవలలు కూడా ఆ దారిలోనే ఉన్నాయి. తెలుగు నవలారంగంలో కొంతకాలంగా కనబడుతున్న స్తబ్దతకు ఈ పోటీల వల్ల సడలింపు వచ్చింది. ఈ వాతావరణానికి కొనసాగింపుగా 2023 జులై 7,8,9 తేదీలలో ఫిలడెల్ఫియాలో జరగనున్న 23వ తానా మహాసభల సందర్భంగా తెలుగు సాహిత్యంలోనూ, ప్రపంచ సాహిత్యంలోనూ కలకాలం నిలబడే నవలలను వెలికి తీసుకురావాలనే తానా ప్రయత్నానికి స్పందించి ఈ పోటీలో పాల్గొనవలసిందిగా తెలుగు రచయితలందరికీ విజ్ఞప్తి చేస్తున్నాము.

### నిబంధనలు

- నవలలు తెలుగు జీవితాన్ని ప్రతిబింబించాలి.
- ప్రపంచంలోని ఎక్కడివారయినా ఈ పోటీకి నవలలు పంపించవచ్చు.
- నవలకు పేజీల పరిమితి లేదు.
- బహుమతికి ఎన్నిక కాని నవలలను తిప్పిపంపడం సాధ్యంకాదు. కాబట్టి జిరాక్స్ కాపీలు కూడా పంపవచ్చు.
- నవలలు తమ స్వంతమని, అనువాదాలు, అనుసరణలు కావని, ఇంతకుముందు ఎక్కడా ప్రచురితం కాలేదని, ఎక్కడికీ ప్రచురణకు పంపలేదని, తానా పోటీ ఫలితాలు వచ్చేవరకూ ఏ ప్రచురణకు, పోటీకి పంపబోమని పేర్కొంటూ హామీపత్రాన్ని జతచేయాలి.
- నవలలు తప్పనిసరిగా స్పష్టమైన చేతివ్రాతతో కాని, డిటిపి చేసికాని పంపాలి.
- డిటిపి చేసిన నవలలను **2023tananovel@gmail.com**కు పంపవచ్చు.
- నవలల పై రచయిత పేరు, చిరునామా ఉండకూడదు. అవన్నీ కవరింగ్ లెటర్ పై ఉండాలి.
- నిర్వాహకుల నిర్ణయాలపై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదు. వివాదాలన్నింటినీ అమెరికాలోని మేరీలాండ్ న్యాయపరిధిలో పరిష్కరించుకోవాలి.
- **బహుమతి పొందిన నవల ఉన్నత ప్రమాణాలను అందుకునేటట్లుగా ఉండాలన్నది తానా ఆకాంక్ష. ఆ ప్రమాణాలను అందుకునే నవలలు పోటీకి రాని పక్షంలో బహుమతి ఇవ్వకపోవడం కానీ లేదా పూర్తి బహుమతి తగ్గించడం కానీ, ఒకటి కంటే ఎక్కువ నవలల మధ్య పంచడం కానీ తానా నిర్ణయం ప్రకారం జరుగుతుంది.**
- **బహుమతికి ఎన్నికైన నవల మొదటి రెండు ముద్రణలను, ఇతర పారితోషికం ఏమీ లేకుండా ప్రచురించే హక్కు తానాకు ఉంటుంది.**
- **2021లో బహుమతి పొందినవారు ఈ పోటీలో పాల్గొనరాదు.**

---

**రచనలు అందవలసిన ఆఖరు తేది: 31 మార్చి 2023**

---

*రచనలు పంపవలసిన చిరునామా*

**అక్షర క్రియేటర్స్, ఎజి-2,**
**'ఏ' బ్లాక్, మాతృశ్రీ అపార్ట్‌మెంట్స్,**
**హైదర్‌గూడ, హైదరాబాద్-500029.**

*ఇతర వివరాలకు సంప్రదించండి*

**ఫోన్స్: 98493 10560**
**040-2970 1939**
**Email: 2023tananovel@gmail.com**

**లావు అంజయ్య చౌదరి**
తానా అధ్యక్షులు

**జంపాల చౌదరి**
కార్యక్రమ నిర్వాహకులు

**చంద్ర కన్నెగంటి**
తానా ప్రచురణల కమిటీ అధ్యక్షులు




* గోపిని కరుణాకర్

# ధనుర్మాసంలో జరిగిందా మహత్యం!

పొద్దున్నే పేపర్ ఏసేదానికి పోతావుంటే, మా పడమర మాడవీధి మలుపు తిరిగి దక్షిణ మాడ వీధిలోకి అడుగుపెట్టానో లేదో, నా ముందు కట్టి వున్న మంచుతెర అటుపక్క నుంచి ఒక స్వరం వినిపించింది. అది ఎమ్మెస్ సుబ్బులక్ష్మిగారి గొంతు.



ఎంతో భక్తిభావంతో గోదాదేవి పాశురాల్ని పాడుతోంది.

మార్గళి త్తిజ్గల్ మది నిరైన్ద నన్నాళాల్
నీరాడ ప్పోదువీర్, పోదుమినో నేరిలైయీర్
శీర్ మల్గుమ్ ఆయ్ప్పాడి శెల్వచ్చిరు మీర్ కాళ్
కూర్వేల్ కొడున్దొళిలన్ నన్దగోపన్ కుమరన్
ఏరార్ న్ద కణ్ణి యశోదై యిళంశింగమ్
కార్మేనిచ్చుజ్ఞణ్ కదిర్మదియం బోల్ ముగత్తాన్
నారాయణనే నమక్కే పరైతరువాన్
పారోర్ పుగళప్పడిన్దేలో రెమ్బావాయ్

సంప్రదాయ తమిళ్ అర్థం కాకపోయినా ఆ పదాలు, ఆ గొంతులో వినడానికి ఎంతో మధురంగా ఉన్నాయి.

ఆ స్వరంతో పాటూ ఎవరో వయోలిన్‌ని పక్క వాయిద్యంగా వాయిస్తున్నారు. మరొకరు డోలక్ వాయిస్తున్నారు. ఇంకెవరో చేతుల్లో పట్టుకున్న తాళాలు లయబద్ధంగా కొడుతున్నారు. రెండు కంచు బిళ్లలను ఒకదానిపై ఒకదానిని తాకించి చేస్తున్న ఆ శబ్దం గుండెల్లో ప్రతిధ్వనిస్తోంది.

మంచుతెరకి అటువైపు ఒక భజనబృందం, బృందగానం చేస్తూ అస్పష్టంగా కదులుతూ నా వైపుకి రావడం కనిపించింది. వాళ్లలోఎమ్మెస్ సుబ్బలక్ష్మిగారి గొంతు కంచు మ్రోగినట్టు మోగుతోంది.

నేను మంచుతెరను తొలిగించుకుంటూ వసంత మండపం దగ్గరికి వెళ్లేసరికి, వాళ్లు మంచుతెరలో నుంచి బయటకొచ్చి నాకు ఎదురుపడ్డారు.

ఆ బృందంలో ఎమ్మెస్ సుబ్బలక్ష్మిగారిని చూసే సరికి, సాక్షాత్తు సరస్వతిదేవి వీణ పట్టుకుని ఎదురు పడినట్టు ఒళ్లు పులకించిపోయింది.

ఏమి ముఖవర్చసు ఆమెది. ఏమి అందం ఆమెది.

ఏమి లక్ష్మీకళ ఆమెది. ఆమె ముఖంలో దైవత్వం ఉట్టిపడుతూ ఉంటుంది. సూర్యుడు అప్పుడే పొడిచినట్టు నుదిటిమీద పావలా కాసంత ఎర్రనిబొట్టు, దానికింద విల్లుని వంచినట్టు వుండే కనుబొమ్మల మధ్యన ఇంకో చిన్న విభూతి అడ్డబొట్టు, రెండు ముక్కులకు రెండు నక్షత్రపుంతలు మెరుస్తున్నట్టు మేలిమి ముత్యాల ముక్కుపుల్లలు, చెవులకి ఎర్రాళ్ల కమ్మలు, పాపటిలో కుంకుమపువ్వు చల్లినట్టు ఎర్రనికుంకుమ, కొప్పుకి చుట్టుకున్న సన్న జాజి పూలు, మెడలో ఎర్రరాళ్ల అడ్డిగ, కాసులపేరు, పచ్చరాళ్ల పతకలతో తాపిన బొట్టుగొలుసు, ఎర్రరంగు చీరమీద బంగారు బుట్టాలు, ముదురుపచ్చ అంచు వున్న కంచిపట్టు చీరని తమిళ సంప్రదాయ మడిసర్ పద్ధతిలో కట్టుకుంది. కొంగుని నిండుగా కప్పుకునింది.

చేతిలోని తాళాలు లయబద్ధంగా తాటిస్తూ పాడుతోంది. ఒక తాదాత్మ్యపు అంచున నడుస్తూ, పాశురాల్ని ఆలాపిస్తూ ఉంది.

ఒక్కక్షణం మైమరిచిపోయి ఆమెనే చూస్తుండిపోయాను.

అమె పక్కన అమె భర్త నిలువెత్తు కల్కి సదాశివంగారు కోరస్ పాడుతూ నడుస్తున్నారు. ఆయన తెల్లని పట్టు పంచెని కట్టుకున్నాడు. మోకాళ్ల కింది కున్న పొడుగు చేతుల జుబ్బాని తొడుక్కున్నాడు. నుదిటిమీద విభూతి పట్టీలను అడ్డంగా దిద్దుకున్నాడు. ఆ బృందంలో సదాశివంగారి కోడళ్లు, వాళ్ల పిల్లలు, వాళ్ల బంధువులు, స్నేహితులు వున్నారు. ఆడపిల్లలు పట్టులంగా, దావణీల్లో బుట్టబొమ్మల్లా వున్నారు. మగపిల్లలు పట్టుపంచె, తెల్లచొక్కా వేసుకున్నారు.



తిరుమల కొండ మీదే పుట్టిన గోపిని కరుణాకర్ ఆ కొండ మీద, అక్కడ నెలకొన్న వెంకన్న స్వామి మీద మక్కువతో, భక్తితో రాసిన కథ ఇది. 'దుత్తలో చందమామ', 'బారతం బొమ్మలు', 'కల్లేటి వంక' వంటి కథలతో కథామాంత్రికుడిగా పేరు తెచ్చుకున్న కరుణాకర్ ఇటీవలే 'బాలాజీ టాకీస్' నవల ప్రచురించారు. మూడు కథాసంపుటాలు, ఒక కవితాసంపుటి ప్రచురించారు. 'మా తిరుపతి కొండ కథలు' వీరికి ప్రత్యేకంగా గుర్తింపు తెచ్చిన కథలు. ఆ కథల కొనసాగింపుగా తానా పత్రిక కోసం ప్రత్యేకంగా రాసిన కథ ఇది. సినిమాలకు, టీవీ సీరియల్స్‌కు స్క్రిప్ట్ రాస్తూ దర్శకత్వ విభాగంలో పనిచేస్తున్నారు.

అందరూ పాశురాలను బృందగానం చేస్తూ మా పడమర మాడవీధిలోకి మలుపుతిరిగి వైఖనస ఆశ్రమ సత్రం వైపుకి నడుస్తున్నారు.

కొంచేపు నిలబడి వాళ్లనే చూస్తుండిపోయాను. వాళ్లు మంచులో మాయమైపోయారు.వాళ్లు చేసే బృందగానం మెల్లమెల్లగా వాల్యూమ్ తగ్గించినట్టు ఆ మంచులో ఎక్కడో కలిసిపోయింది.

నేను కొండంతా తిరిగి పేపరేసి ఇంటికొచ్చి, స్నానం చేసి స్కూల్‌కి వెళ్లాడానికి యూనిఫామ్ వేసుకుని రెడీ అవుతుంటే మా ఇడ్లీ అవ్వ చెప్పింది.

“ఎమ్మెస్ సుబ్బులక్ష్మి బృందం వైఖనస సత్రంలో దిగి వుండాది.వాళ్లకు పాలు ఎత్తుకోనిపొయ్యి ఇచ్చేసి ఇస్కూల్కుపో,” అని చెప్పింది.

“నాకు స్కూల్ కి టైమ్ అయిపోతావుండాది. ఫస్ట్ పీరియడ్ గోవిందరెడ్డి సర్‌ది. మాథ్స్ హోమ్ వర్క్ చెయ్యకపోయినా గొమ్మునుంటాడు కానీ, లేట్‌గా పోతే తాట తీస్తాడు,” అన్నాను.

“వాళ్లు మడి ఆచారం పాటిస్తారు. నేను ఇంగా స్నానం చెయ్యలేదు. నువ్వు స్నానం చేసావు. సత్రంలోకి పొయ్యి ఇచ్చేసిపో నాయన. పొద్దుననగా లేచి, నాలుగు మాడవీధుల్లో భజన చేసుకుంటూ గుడికి పొయ్యి వచ్చుంటారు. గొంతు ఆర్చకపొయ్యి ఉంటుంది. అన్ని కాపీనీళ్లు వేడివేడిగా గొంతులో పడితే ప్రాణం లేసొస్తుంది. అసలే ధనుర్మాసం చలి దంచికొడతా వుండాది. పో... నాయన?”అని చెప్పింది.

“నేను పోను.నన్ను తీసుకుపోకుండా నువ్వు, చెల్లెమ్మ అవ్వ సైగ్గా దిగువకు పొయ్యి రామకృష్ణ కోటాయిలో *శంకరాభరణం* సినిమా చూసేసి వచ్చుండారు. నువ్వు ఎంత మోసకారిదానివి. నువ్వు చెప్పిన పని నేను చెయ్యను పో...” అన్నాను మొండిగా.

“నీకు *శంకరాభరణం* సినిమా అర్థంకాదు. అందుకే నిన్ను తీసుకోని పోలేదు. వచ్చే నెల్లో ఎన్టీఆర్‌ది సర్దార్ పాపరాయుడు సినిమా, కొత్తగా కట్టుండే డిఆర్ మహల్లో రిలీజ్ అవుతా వుండాది... పోదాము. నీకు రెండు రోజ్ మిల్కులు కొనిస్తాను సరేనా?” అని చెప్పింది.

సర్దార్ పాపరాయుడు సినిమా అనగానే నాకు ఎక్కడలేని హుషారు వచ్చింది.



"సరే... పాలు ఇవ్వు. ఇచ్చేసేసి స్కూల్‌కి పోతాను," అన్నాను, పుస్తకాల బ్యాగ్‌ని భుజానికి వేసుకుంటూ.

పెద్ద వెండిచెంబు నిండా అప్పుడే పిండిన గుమ్మ పాలు. వేడిగా ఉన్నాయి. బురుగు చెంబు పైనుంచి పొంగిపోయి వుండాది.

ఆ చెంబు తీసుకుని వీధిలోకి వచ్చాను.

వైఖాన ఆశ్రమం సత్రం మా సందుకు ఎదురుగా ఉంటుంది. మెట్లెక్కి లోపలికి పోబోతుంటే అక్కడున్న ఎమ్మెస్ సుబ్బలక్ష్మిగారి సెకరెట్రి ఆత్మమానందన్ నన్ను ఆపాడు.

"ఎంగె పోరే?" అని అడిగాడు.

"సుబ్బలక్ష్మమమ్మ పాటీక్కి పాల్ కొండు వందేన్," అన్నాను.

"పో... ఉల్లపో. కుడి ఎడత్తిలే ఇరుక్ రుద రూమ్," అన్నాడు.

ఆ సత్రం పైనా, కిందా రూమ్స్ అన్నీ వాళ్ల బృందమే బుక్ చేసుకున్నట్టు ఉంది. కుడిపక్కకి స్పెషల్ రూమ్ ఉంది. పెద్దపెద్ద టేకు ద్వారాలు, లోపలికి పోతే పెద్ద హాలు, ఆ హాలుగోడకి నిలువెత్తు వెంకటేశ్వర స్వామి, పద్మావతిదేవి పెయింటింగ్స్ ఉన్నాయి. లోపలి నుంచి, 'ఓం నమో నారాయణాయ,' అనే పంచాక్షరీ మంత్రం మంద్ర స్థాయిలో వినిపిస్తోంది. అది ఎమ్మెస్ సుబ్బలక్ష్మిగారు పాడిన రికార్డ్.

ఆ గుమ్మం ముందు ఒక ఇనుపగేటు వేసి వుంది. ఆ గేటుకి పైనున్న కాలింగ్ బెల్ కొట్టాను.

"యారు...?"

"పాల్ కొన్ దటి వందే పాటి," అన్నాను.

"ఉల్ల వాంగ..." అని పిలిచారు.

గేటుని పక్కకు జరిపి లోపలికి పొయ్యాను.

చిన్న నిప్పులకుంపటి ముందు ఎమ్మెస్ సుబ్బలక్ష్మిగారు కూర్చుని వున్నారు. నిప్పులమీద స్టీల్ గిన్నెలో వేడి నీళ్లు ఉడుకుతున్నాయి. పక్కనే ఇత్తడి కాఫీ ఫిల్టర్ ఉంది. ఈ వేడివేడి నీళ్లు ఫిల్టర్లో పోసి మూత పెట్టింది. ఒక్కసారిగా కాఫీ వాసన గుప్పుమనింది.

ఆమెతో పాటూ ఇంకా ఎవరో వున్నారు. ఆమె కూతురు రాధ పూలమాల కడుతోంది.

"చెల్లెమ్మ వరలియా..." అని అడిగారు సుబ్బలక్ష్మి గారు.

"లేదు... చెల్లెమ్మ అవ్వ వాళ్ల మీనాక్షి ఆవు అడివికి పొయ్యి మూడురోజులు అయిపోయుండాది. ఇంకా రాలేదు. ఏ పులో తినేసి ఉంటుందని చెల్లెమ్మ అవ్వ ఏడుస్తూ కూర్చోని వుండాది. వరదరాజన్ అయ్యర్ తాత యానాదోళ్లను అడివిలోకి పంపించి వెతికిస్తున్నాడు. మీనాక్షి ఆవు జాడ కనిపించలేదు," అని తమిళ్‌లో చెప్పాను.

"అయ్యో... పెరుమాళ్," అని అనింది సుబ్బలక్ష్మిగారు.

"పాలు మమ్మల్ని ఇమ్మని చెప్పి, అయ్యర్ తాత గుళ్లోని పోటులో ప్రసాదాలు చేసేదానికి పోయినాడు," అని చెప్పాను.

"అప్పిడియా... కుంజమ్మా... కుంజమ్మా..." అని ఒక అమ్మాయిని పిలిచింది.

"అన్ దా పయ్యకట్టా పాల్ వాన్గిక్కోమా?" అని చెప్పింది సుబ్బలక్ష్మిగారు.

దావణి వేసుకున్న ఒక అక్క వచ్చి నా దగ్గర పాలు తీసుకునింది.

నేను పాలు ఇచ్చేసి సత్రంలో నుంచి వీధిలోకి వచ్చాను. నాలుగుమాడ వీధుల్లో ఉన్న స్పీకర్స్‌లో నుంచి పి. సుశీలగారు పాడిన పాట వినిపిస్తోంది.

దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు రాస్తే, పెండ్యాలగారు స్వరపరిచిన భాగ్యరేఖ చిత్రంలోని పాట అది.

ఊ... ఊ... ఊ...<br>
నీవుండేదా కొండపై నా స్వామి,<br>
నేనుండేదీ నేలపై<br>
ఏ లీల సేవింతునో... ఏ పూల పూజింతునో...<br>
ఊ... ఊ... ఊ...<br>
శ్రీ పారిజాత సుమాలెన్నో పూచె

ఈ పేదరాలి మన స్సెంతో వేచె
నీ పాద సేవా మహాభాగ్యమీవా
ఏడుకొండలపైనా వీడైన స్వామి
నాపైని దయజూపవా నా స్వామి

అని పాడుతుంటే హృదయంలో ఒక పూలకొమ్మ ఊగుతున్నట్టు ఎంతో హాయిగా ఉంది.

వరదరాజన్ అయ్యర్ తాత వాళ్లది తమిళనాడులోని కాంచీపురం. చెల్లెమ్మ అవ్వ ఆయన భార్య.

ఈ చెల్లమ్మ అవ్వకి దగ్గర బంధువులు అవుతారు కల్కి సదాశివంగారు. సుబ్బలక్ష్మమమ్మ అవ్వ తిరుమల కొండకొస్తే, వాళ్ల వసతి, వంటకి కావలసిన వస్తువులు, దర్శనాలు, ప్రసాదాలు అన్నీ దగ్గరుండి అయ్యర్ తాత, చెల్లెమ్మ అవ్వ చూసుకునేవాళ్లు.

అయ్యర్ తాత గుళ్లోని పోట్లో పనిచేస్తాడు. దేవునికి నైవేద్యానికి కావలిసిన ప్రసాదాలు ఈ తాత వండుతాడు. చక్కెరపొంగలి, నెయ్యి పొంగలి, పులిహోర, దద్ధోజనం, పాయసం. ఈ పాయసంలో ముంతమామిడి పప్పు, ద్రాక్ష తేలుతూ ఉంటుంది. ఈ పాయసం కుండని ఎత్తి నోటికి కరిపిచ్చుకుంటే, దించకుండా తాగేస్తాను. వడ, అప్పం, రాత్రి దేవుని నైవేద్యానికి పెట్టె తీపి దోసెలు, అబ్బాబ్బా... ఈ దోసెల్లో నుంచి బెల్లంపాకం, తుట్టెలో నుంచి తేనె కారినట్టు కారుతూ ఉంటుంది. నోట్లో పెట్టుకుంటే తియ్యగా కరిగిపోతుంది.రాత్రి నైవేద్యం పెట్టే మిరియాలు పొడిచేసి ఒత్తుగా చల్లి చేసే అన్నం. ఈ అన్నం ఘాటుగా ఉంటుంది కానీ, వేడివేడిగా తినాలి. ఎమా రుచి ఉంటుంది.

చేటంత జిలేబి, కళ్యాణోత్సవం కట్టిన వాళ్లకు ఇస్తారు. ఒక్కొక్క జిలేబీని కొత్తచేటలో పెట్టి ఇస్తారు. అందుకే దాన్ని చేటంత జిలేబి అంటారు.

అయ్యర్ తాత చేతిలో ఏ మహత్యం వుందోగాని చక్కరెపొంగలిలోకి ఆ తీపి ఎట్టా ఊరుతుందో తెలీదు. నెయ్యి పొంగలిలోకి ఆ రుచి ఎట్టా చేరుతుందో తెలీదు. పులిహోరలోకి పులుపెట్టా పులుస్తుందో తెలీదు. దద్దోజనంలోకి ఆ కమ్మదనం ఎలా కమ్ముకుంటుందో తెలీదు. దేవుడు ఆ ప్రసాదాల్ని లొట్టలు వేసుకుంటూ ఆరగిస్తాడు. వేళ్ల సందుల్లో నుంచి కారిపోతున్న నెయ్యి చేతిని తియ్యగా నాక్కుంటాడు. అయ్యర్ తాత చేసే ప్రసాదాలు అంటే అంత ఇష్టం.

దేవుడికి అప్పుడే నైవేద్యం పెట్టిన ప్రసాదాల్ని ఆరార తినాలి. ఆ రుచే వేరు.

అయ్యర్ తాత, మా లక్ష్మయ్య నాయుడు తాత క్లోజ్ ఫ్రెండ్స్. చెల్లెమ్మ అవ్వ, మా ఇడ్లీ అవ్వ క్లోజ్ ఫ్రెండ్స్.

మా అమ్మ అయ్యర్ తాతని మామ అని, చెల్లెమ్మ అవ్వని మామియార్ అని పిలిచేది.

వాళ్లకు పిల్లలు లేరు. పశువులే వాళ్ల పిల్లలు.

వాళ్ల ఇల్లు దక్షిణ మాడవీధిలో వరాహస్వామి గుడికి ఎదురుగా వుండే సందులో ఉండేది. దానికి పక్కనే తాళ్లపాక వారి మండపం ఉండేది. అన్నమయ్య కొండపై నివసించినప్పుడు ఉన్న ఇల్లు అది. తాళ్లపాక వంశస్థులు నివసించే వాళ్లు.

ఎత్తైన రాతికూసాలు నిలబెట్టిన రాతిమండపంలో నుంచి అయ్యర్ తాత వాళ్ల ఇంటిలోకి వెళుతుంటే చీకటిగుహలోకి వెళుతున్నట్టు ఉండేది. చెక్క దూలాలతో నిర్మించిన పాతకాలం ఇల్లు. ఆ కిటికీలు, ద్వారాలు ముదురుపచ్చరంగు పెయింటింగ్ పెచ్చులూడిపోయి వుండేది. హాల్లో ఒక లడ్డు ఫ్యాన్, బెడ్‌రూమ్‌లో ఒక లడ్డు ఫ్యాన్ బద్ధకంగా తిరుగుదామా, వద్దా అన్నట్టు తిరుగుతుండేవి.

ఆ ఇంటికి వెనుక గొడ్లకొట్టం ఉండేది. ఆ గొడ్లకొట్టంలో పచ్చగడ్డి, పేడని పశువులు కసాబిసా తొక్కేసి అదొరకం వాసన వచ్చేది. యానాదోళ్లు అడివిలోకి పొయ్యి కాశిగడ్డి కోసుకొచ్చి మోపులు అమ్మేవాళ్లు.

యానాదోళ్ల దగ్గర ఆ కాశిగడ్డి మోపుల్ని అయ్యర్ తాత కొనుక్కుని పశువులకు మేత వేసేవాడు. కాశిగడ్డి భలే శ్రేష్టం. పశువులు కాశిగడ్డిని తింటే పొదుగులు పిగిలిపోయేట్టు పాలు ఇచ్చేవి.

ఆ పశువులకు దేవుళ్ల పేర్లు పెట్టి పిలిచేవాడు.

ఎద్దుని సుందరేశ్వరా అని, ఆవుని మీనాక్షమ్మ అని పిలిచేవాడు. దూడల్ని పిల్లయార్, ఆర్ముగ అని పిలిచేవాడు.

ఆవుపాలు కాఫీకి, పెరుగుకి కావలసిన పాలుని మాత్రమే పిండుకుని మిగతా పాలు దూడలకు వదిలేసేవాళ్లు. అవి అమ్మ పొదుగుల్ని తనివితీరా కుడిసేవి.

గురువారం పిండిన గుమ్మపాలు దేవుని అభిషేకానికి ఎత్తుకోని పొయ్యి ఇచ్చేవాడు.

పొద్దున పశువుల్ని అడివిలోకి తోలిస్తే, కడుపు నిండా మేసి సాయంత్రానికి ఇంటికొచ్చేవి. వాటికి దాణా పెట్టడం, గడ్డి వెయ్యడం, వారానికి ఒకసారి వాటిని శుభ్రంగా పీచుతో కడగడం, పాలు పితకడం అన్నీ అయ్యర్ తాతే చేసేవాడు. వాళ్లకు పిల్లలు లేరు కాబట్టి ఆ పశువుల్ని బిడ్డల కంటే ఎక్కువుగా చూసుకునే వాళ్లు.

నాలుగు రోజుల క్రితం మేతకి అడివికి పోయిన సుందరేశ్వరుడు, మీనాక్షమ్మ సాయంత్రానికి తిరిగి రాలేదు. రెండు రోజుల తరవాత నడిరాత్రి సుందరేశ్వరుడు ఒక్కడే ఒంటరిగా వచ్చాడు. మీనాక్షమ్మ రాలేదు.

"ఏమైంది సుందరేశ్వరా? మీనాక్షమ్మ ఎక్కడ?" అని అడిగాడు.

సుందరేశ్వరుడు చాలా ఆందోళనగా వున్నాడు.

పుట్టని కొమ్ములతో కూరినట్టు, కొమ్ములకు మట్టి అంటి ఉంది. ఒక కొమ్ము పెచ్చులూడి పొయ్యి నెత్తురు కారిపోయి గడ్డకట్టి ఉంది.

ఏదో జరగరాని ప్రమాదం జరిగిందని అయ్యర్ తాత గ్రహించాడు. సుందరేశ్వరుడ్ని తీసుకెళ్లి గొడ్ల కొట్టంలో కట్టేసి గాయం అయిన కొమ్ముకి పసుపు గుడ్డ చుట్టాడు. గడ్డి వేసి, నీళ్లు పెట్టాడు. సుందరేశ్వరుడు ఆ గడ్డిని మూచూడలేదు. కనుగుడ్లల్లో నీళ్లు కుక్కు కుని దిగులుగా చూస్తోండిపోయాడు.

ఆ నడిరాత్రి అయ్యర్ తాత గోగర్భం డ్యాం దగ్గరున్న యనాది క్వార్టర్స్ పొయ్యి, యానాదోళ్లను లేపి మీనాక్షమ్మను వెతకమని పంపించాడు.



వాళ్లు మూడురోజులుగా అడివంతా వెతుకు తున్నారు. మీనాక్షి ఆవు జాడ కనిపించలేదు.

ఈలోపు ఎమ్మెస్ సుబ్బలక్ష్మి గారి బృందం కొండ మీద దిగింది.

“లక్ష్మయ్య... రేపు సుబ్బలక్ష్మిగారి బృందం దిగుతుంది. ఉన్నన్ని రోజులు మీరే పాలు పంపించాలి,” అని అయ్యర్ తాత చెప్పాడు.

మాక్కూడా ఆవులున్నాయి.

మాకు పరమడమాడ వీధిలో శ్రీ బాలాజీ టీ స్టాల్ అని టీ అంగడి ఉంది. మా ఆవుల దగ్గర పాలు పిండి మా టీ స్టాల్‌కి వాడుకుంటాము. గురువారం ఆవుల దగ్గర పిండిన పాలు మొత్తం గుళ్లో దేవుని అభిషేకానికినికి పంపించేస్తాము.

“రేయ్ మచ్చా...” అని పిలిస్తే ఆలోచనల్లో నుంచి బయటపడి చూశాను.

రమేష్‌గాడు నవ్వుతూ, స్కూల్ బ్యాగ్‌ని వీపుకి తగిలించుకుంటూ వచ్చాడు. వాడిది నవ్వు ముఖం.

దక్షణమాడ వీధిలో కుడివైపున తిరుమల తిరుపతి దేవస్థానం వారి స్టోర్ ఉంటుంది. అక్కడ నిత్యావసర వస్తువులు దొరుకుతాయి. ఆ స్టోర్‌కి ఆనుకుని మా రమేష్‌బాబు వాళ్ల లాండ్రీ షాప్ ఉంటుంది. వాళ్ల నాన్న బట్టలు ఇస్త్రీ చేస్తున్నాడు.

వాళ్లమ్మ శృంగేరిమఠం దగ్గరున్న కోలాయి దగ్గర, నీళ్లు పడుతున్న శ్రీనివాసులు రెడ్డి భార్యతో మాట్లాడుతోంది. రమేష్ వాళ్లమ్మ ముఖానికి పసుపు రాసుకుని, నుదిటిమీద రూపాయి కాసంత ఎర్రని కుంకుమబొట్టు పెట్టుకుంటుంది. నాకు వాళ్లమ్మను చూస్తే ఆ బొట్టే గుర్తుకు వస్తుంది.

రమేష్, నేను కలిసి మాట్లాడుకుంటూ శృంగేరి మఠం పక్కనున్న మెట్లు ఎక్కి, చింతచెట్ల కింద నుంచి నడుస్తూ, ఎడం వైపునున్న బిఎన్ రెడ్డి ఇంగ్లీష్ మీడియం స్కూల్ దాటుకుని, గాలిచక్రం దగ్గరున్న మా తిరుమల తిరుపతి దేవస్థానం వారి శ్రీ వెంకటేశ్వర ఎలిమెంటరీ స్కూల్‌కి వెళ్లాము.

*

సాయంత్రం స్కూల్ నుంచి వచ్చేసరికి చెల్లెమ్మ అవ్వ మా ఇంటికొచ్చింది. ఫ్రెండ్స్ ఇద్దరూ గుడికి ఎదురుగా ఉన్న సదస్సులో జరిగే ఎమ్మెస్ సుబ్బలక్ష్మి గారి కచ్చేరికి పొయ్యేదానికి రెడీ అవుతున్నారు.

“నేను వస్తాను అవ్వ,” అని మా ఇడ్లీ అవ్వని అడిగాను.

“ఎక్కడికి పోయినా సంకలో పిల్లినెత్తక పోయి నట్టు, నిన్ను తీసుకోని పొమ్మంటావు. ముందు హోమ్ వర్క్ పూర్తిచెయ్యి. తరవాత వద్దువుగాని,” అని అనింది మా అవ్వ.

యూనిఫామ్ కూడా విప్పకుండా, కాళ్లు, ముఖం కూడా కడుక్కోకుండా హోమ్ వర్క్ రాసేదానికి కూర్చున్నాను.

వాళ్లిద్దరూ చాలా ఇష్టంగా ఎమ్మెస్ సుబ్బలక్ష్మి గారి గురించి మాట్లాడుకుంటున్నారు.

“ఎమ్మెస్ సుబ్బలక్ష్మి మామియార్ మా అయ్యర్ కులం కాదు. వాళ్లు దేవదాసీలు,” అని చెప్పింది చెల్లెమ్మ అవ్వ.

మా అవ్వ ఆశ్చర్యపోయింది.

“దేవదాసీలా...!” అనింది.

దేవదాసీలు అంటే నాకు అర్థం కాలేదు.

“చెల్లెమ్మ... నేను అస్సలు నమ్మలేకపోతున్నాను. కట్టు, బొట్టు, నడక, నడతా, వంటావార్పు, మడి ఆచారం, సంప్రదాయం అంతా మీ అయ్యర్ల నోట్లో నుంచి ఊడి పడినట్టు వుంటుందే?” అని ఆశ్చర్య పోతూ అడిగింది.

“వాళ్ల అప్ప సుబ్రహ్మణ్యం అయ్యర్ మా బ్రాహ్మణులు. వాళ్లమ్మ షణ్ముఖ వడివర్ అమ్మాళ్ దేవదాసి కులంలో పుట్టింది. సంగీత విద్వాంశురాలు. రంగస్థల నటి. వీణా వాయిద్యకారిణి. వీటన్నింటి కంటే మించి మహా అందగత్తె. ఆ అందమే సుబ్బలక్ష్మి మామియార్‌కి కూడా వచ్చింది. మామియర్ అమ్మమ్మ అక్కమ్మాళ్‌గారు కూడా గొప్ప వయోలిన్ విద్వాంశురాలు అని మా వరదరాజన్ అయ్యర్ చెపుతుంటే విన్నాను,” అని చెప్పింది.

నేను హోమ్ వర్క్ చేసుకుంటూ చెల్లెమ్మ అవ్వ చెప్పేది వింటున్నాను.

"సుబ్బులక్ష్మి మామియార్ ప్రాథమికంగా తన తల్లి షణ్ముఖవడివర్ అమ్మాళ్ వద్ద కర్నాటక శాస్త్రీయ సంగీత శిక్షణను ప్రారంభించింది. అంత చిన్న వయసులో పాడుతూ, పాడుతూ ఆ పిల్ల తాదాత్మ్యం అంచుకు చేరి రాగాలీనమై పోవడడం తల్లి గమనించింది. తరువాత పండిట్ నారాయణరావు వ్యాస్ దగ్గర హిందుస్థానీ క్లాసికల్ శిక్షణ పొందింది. సెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్ ఆధ్వర్యంలో కర్ణాటక సంగీతంలో శిక్షణ తీసుకుంది. మామియార్ పదేళ్ల వయసులో తొలి రికార్డింగ్ విడుదలైంది.

తన పదకొండేళ్ల వయసులో తిరుచిరాపల్లి రాక్‌ఫోర్ట్ టెంపుల్‌లోని వందస్తంభాల హాలులో తన తొలి కచ్చేరి చేసింది. ఆ తొలి కచ్చేరికి మైసూర్ చౌడియాతో వయోలిన్, దక్షిణామూర్తి పిళ్లై మృదంగం పక్కవాయిద్యాలు వాయించారు. దీనిని తిరుచిరాపల్లికి చెందిన ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నాయకుడు ఎఫ్.జి నటేసా అయ్యర్ నిర్వహించారు.

మామియార్ వాళ్లమ్మ షణ్ముఖ వడివర్ అమ్మాళ్‌కి కూతురులోని ప్రతిభని గ్రహించి గొప్ప సంగీత విధ్వాంశురాలుని చేయాలని కంకణం కట్టుకుని, మధురై నుంచి మకాం, కళలకు కాణచి అయిన మదరాసు పట్టణానికి మార్చింది. పదమూడేళ్ల వయసులో మామియార్ ఎంతో ప్రతిష్టాత్మకమైన మ్యూజిక్ అకాడమీ హాల్లో కచ్చేరి చేసింది. భజనలు, శ్లోకాలు, కీర్తనలు పాడి అప్పుడున్న మహా మహా సంగీత విద్వాంశులను మంత్రముగ్ధులను చేసింది.

ఒక దేవదాసి పిల్ల ఎంతో ఉన్నతమైన మ్యూజిక్ అకాడమీ హాల్లో పాడడం ఏమిటని, అకాడమీలో సభ్యులుగా ఉన్న సంప్రదాయవాదులు వివక్ష చూపించారు. తన గానంతో ఆ సంప్రదాయవాదుల నోరు మూయించింది.

ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నాయకుడు ఎఫ్.జి. నటేసా అయ్యర్, తొలి కచ్చేరి చేసే అవకాసాన్ని ఇచ్చినట్టే, తను ప్రొడ్యూస్ చేస్తూ, హీరోగా నటిస్తున్న సేవాసదన్ సినిమాలో సుబ్బులక్ష్మి మామియార్‌కి హీరోయిన్‌గా అవకాశాన్ని ఇచ్చాడు. అలా హీరోయిన్‌గా అరంగేట్రం జరిగింది. తొలి కచ్చేరి మాదిరిగానే, తొలి సినిమా సూపర్ హిట్ అయ్యింది.

కల్కి అనే తమిళ పత్రిక వ్యవస్థాపకులలో ఒకడైన మా కల్కిసదాశివం మామ, సుబ్బులక్ష్మి మామియార్‌ని ఇంటర్వ్యూ చేయడానికి వచ్చాడు.

ఆ మొదటి పరిచయంలోనే ఇద్దరు స్నేహితులయ్యారు. కల్కి సదాశివం మామ సైద్ధాంతిక, రాజకీయ అభిప్రాయాలను ఎంతగానో గౌరవించేది. ప్రేమించేది.

ఆ స్నేహం తరవాత ప్రేమగా మలుపు తిరిగింది.

కల్కి సదాశివంమామ తిరుచిరాపల్లి జిల్లాలోని ఆంగరైలో జన్మించాడు. త్యాగరాజన్, మంగాళం అయ్యర్ దంపతులకు గల పదహారుమంది సంతానంలో మూడవవాడు.

లాలాలజపతిరాయ్, బిపిన్ చంద్రపాల్, లోకమాన్య తిలక్, శ్రీ అరబిందో ఘోష్‌ల రచనల, ఉపన్యాసాలకు ప్రభావితుడైన కల్కి సదాశివం మామ భారత స్వాతంత్ర్యోద్యమంలో చిన్నవయస్సులో చేరాడు. అతడు సుబ్రహ్మణ్య శివ శిష్యునిగా ఒక ఆంగ్లేయుని చంపాలనుకున్నాడు. దానికి జైలుశిక్ష అనుభవించాడు.దీని ఫలితంగా కల్కి సదాశివం మామ స్కూల్ చదువులకు దూరమయ్యాడు.

తరవాత భరతసమాజ్‌లో చేరాడు. కుష్టురోగంతో బాధపడుతున్న వారికి సేవలు చేశాడు. స్వదేశీ ఉద్యమంలో పాల్గొంటున్న సుబ్రహ్మణ్య శివకు సహాయాన్నందించాడు. రాజగోపాలాచారి, మహాత్మా గాంధీల ఉపన్యాసాలకు ప్రభావితుడై అహింసా ఉద్యమంలో పాల్గొన్నాడు.

అతనికి అప్పటికే పెళ్లైంది. భార్య పేరు అపితకుచ లాంబాల్. రాధా, విజయ అనే ఇద్దరు కుమార్తెలు కూడా ఉన్నారు.

రెండో కానుపు తర్వాత ఆమె తల్లిగారి ఇంటి నుంచి మెట్టినిల్లు మద్రాసుకు వచ్చేసరికి, సదాశివం మామ, సుబ్బలక్ష్మి మామియార్ చనువుగా ఉండడం గమనించింది. భర్త అంటే ఉన్న భయం వల్ల ఎప్పుడూ ఆమె బయటపడేదిగాదు. దానికి తోడు అత్తగారైన, సదాశివం మామ తల్లిగారు మంగళం అయ్యర్ కొడుకుని అతిగా గారబం చెయ్యడం వల్ల ఎదురు చెప్పలేకపోయేది. ఎందుకోతెలీదు. ఏవో అనారోగ్య కారణాల వల్ల ఆమె చనిపోయింది.

అప్పటికి ఒకవైపు సుబ్బలక్ష్మి మామియార్ కచ్చేరీలు చేస్తూనే సినిమాల్లో కూడా నటిస్తూ ఉంది.

సేవసదన్, శకుంతలై, మీరా, హిందీలో మీరాబాయి, ఆయర్ తలైవాంగి, అపూర్వచింతామణి లాంటి సినిమాల్లో హీరోయిన్‌గా నటించి విశేష ఆదరాభిమానాలను పొందింది. అలాంటి సమయంలో సదాశివం మామని పెళ్లి చేసుకుని సినిమాలకు స్వస్తి చెప్పింది. తరవాత తన జీవితాన్ని సంగీతానికి అంకితం చేసింది. శాస్త్రీయ సంగీతంలో దేశం గర్వించతగ్గ గాయనిగా పేరు తెచ్చుకుంది. ఎన్నో అత్యుత్తమ అవార్డులను, సన్మానాలను పొందింది, అని సుబ్బలక్ష్మమవ్వ గురించి చెప్పింది.

మా ఇడ్లీఅవ్వ ఆమె చెప్పేదంతా వింటూ మౌనంగా ఉండిపోయింది.

"ఎన్ని అవార్డులు సంపాయిస్తే ఏముంది? ఎన్ని సన్మానాలు చేసుకుంటే ఏముంది. ఆమెకు ఇష్టమైన కోరిక తీరకుండానే ఉండిపోయింది," అని చెప్పి నిష్టూరపోయింది చెల్లెమ్మ అవ్వ.

"ఏం కోరిక చెల్లెమ్మా అది?" అని అడిగింది మా ఇడ్లీ అవ్వ.

"త్యాగరాజు, అన్నమయ్య, ముత్తుస్వామి దీక్షితర్, శ్యామశాస్త్రి, తరిగొండ వెంగమాంబలాంటి వాగ్గేయకారులు గర్భగుడిలో పెరుమాళ్ ముందు నిలబడి భక్తి పారవశ్యంతో కీర్తనలు పాడారు. పెరుమాళ్‌కి అడ్డుగా వేసిన తెరలు తొలిగించారు. పెరుమాళ్‌కి, పెరు అంబాల్‌కి పెళ్లిచేశారు. పెరుమాళ్‌ని ఊయలలో పడుకోబెట్టి ఏకాంతసేవలు



చేశారు. సుబ్బలక్ష్మి మామియార్‌కి కూడా, ఆ వాగ్గేయ కారుల్లాగా గర్భగుడిలో పెరుమాళ్ ముందు నిలబడి పాడాలని కోరిక ఉంది. కానీ తిరుమల తిరుపతి దేవస్థానంవారు సుబ్బలక్ష్మి మామియార్‌కు ఆ అవకాశం ఇవ్వలేదు,'' అని చెప్పి బాధపడింది చెల్లెమ్మ అవ్వ.

"అయ్యో... ఎందుకు చెల్లెమ్మా?"అని అడిగింది మా అవ్వ.

"మామియార్ దేవదాసి, సినిమా హీరోయిన్ అవ్వడంవల్ల ఆ అవకాశం ఇవ్వలేదు. ఆగమ శాస్త్రాలు అందుకు ఒప్పుకోవు,'' అని చెప్పింది.

"అవునా...?'' అని దీర్ఘం తీసింది మా అవ్వ.

"ఈ జన్మకు సుబ్బలక్ష్మి మామియార్ కోరిక తీరదు. ప్రాప్తం అంతే!'' అని నుదురుని చూపించింది చెల్లెమ్మ అవ్వ.

నా హోమ్ వర్క్ అయిపోయింది.

గబగబా ముఖం కడుక్కుని, పౌడర్ రాసుకుని రెడీ అయిపోయాను. ఇస్త్రీ చేసి బీరువాలో పెట్టిన జీన్స్ ప్యాంట్, టీ షర్ట్ తీసుకుని వేసుకున్నాను.

ఇప్పుడిప్పుడే జీన్స్‌ప్యాంట్లు ఫ్యాషన్ అవుతున్నాయి. ఆకలి రాజ్యం సినిమాలో కమల్‌హాసన్, అతని ఫ్రెండ్స్ ఎక్కువగా జీన్స్ ప్యాంట్లు వేస్తారు. మా మామలాంటి యూత్ జీన్స్‌ని ట్రెండీగా ఫాలో అవుతున్నారు.

"నేను రెడీ... పదామా?'' అన్నాను వాళ్ల ముందు నిలబడి.

"ముందే చెపుతున్నాను... సినిమా కోటాయిలో లాగా ఇంట్రవెల్ ఉండదు. నీకు కొనిచ్చేదానికి రోజ్ మిల్క్‌లు, చేతి మురుకులు ఉండవు. సదుస్సులోకి పోయిన తరవాత నన్ను సతాయించకూడదు,'' అని ముందుగానే హెచ్చరించింది మా అవ్వ.

"సరే...'' అన్నాను అయిష్టంగా.

ముగ్గురం బయలుదేరాం.

మా పడమరమాడ వీధిలో, మా టి అంగడికి ఎదురుగా గుడివైపుగా పొయ్యే తీర్థకట్టవీధి సందు లోకి వచ్చాము. ఆ సందులోనుంచి పైన పిపి షెడ్‌లో నుంచి సర్వదర్శనం క్యూ వెళుతుంది. కింద మెట్లు ఉంటాయి. ఆ మెట్లు దిగి కొనేటికట్ట వీధిలోకి వచ్చాము.

కుడివైపు గుడి రాతిగోడ ఎత్తుగా ఆకాశంలోకి చొచ్చుకుపోయి నిలబడి ఉంది. ఎడమ వైపునున్న గణేష్ భవన్ హోటల్ ముందు నడుస్తున్నాము.

చెల్లెమ్మ అవ్వ చెప్పింది.

"ఇప్పుడు సుబ్బలక్ష్మి మామియార్ వాళ్ల ఆర్థిక పరిస్థితి ఘోరంగా వుండాది. కల్కి పత్రిక మూత పడింది. ఆళ్వార్‌పేటలో ఉన్న మూడు అంతస్థుల భవనాన్ని అమ్మేశారు. కారు లేదు. ఇప్పుడు వల్లువర్ కొట్టంలో చిన్న బాడిగా ఇంట్లో వుంటున్నారు,'' అని చెప్పింది.

"అయ్యో... కచ్చేరీలు చేసి సంపాయించిన డబ్బంతా ఏమయ్యింది చెల్లెమ్మా?'' అని అడిగింది మా అవ్వ.

"వచ్చిన డబ్బుని వచ్చినట్టే మా సదాశివం మామ హారతి కర్పూరాన్ని వెలిగించినట్టు, ఖర్చు పెట్టేసాడు. దానధర్మాలు చేసేశాడు.''

"ఇప్పుడెట్లా వాళ్ల జీవనం గడిసేది?''

"పివిఆర్కే ప్రసాద్‌గారు అన్నమాచార్య ప్రాజెక్ట్ బాధ్యతలు సుబ్బలక్ష్మి మామియార్‌కి అప్పజెప్పారు. అన్నమాచార్య కీర్తనలను పాడితే రికార్డ్ చేస్తున్నారు. అందుకుగాను పదిలక్షలు బ్యాంక్‌లో మామియార్, సదాశివం మామ పేరుమీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. దాని మీద వచ్చే ఆదాయమే వాళ్లకు ఇప్పుడు ఆధారం,'' అని చెప్పింది.

ఆమాటకి మా అవ్వ మౌనంగా ఉండిపోయింది.

"పోనీలే... పెరుమాళ్‌ని నమ్ముకున్నందుకు ఈ విధంగా అయినా సహాయపడ్డాడు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థానగాయనిగా ఉంది. ఈ జన్మకు అదొక సంతృప్తి సుబ్బలక్ష్మి మామియార్‌కి,'' అని చెప్పింది.

ఈ కథలో సుబ్బలక్ష్మమ్మ అవ్వని, గర్భగుడిలో దేవుని ముందు నిలబడి, వాగ్గేయకారుల్లా పాడనివ్వక పోవడం నాకు చాలా అన్యాయం అనిపించింది. బాధగా అనిపించింది.



గుడి ముందున్న సదస్సు దగ్గరకు వెళ్లాము.

సదస్సు లోపల, బయట జనం కిటకిటలాడు తున్నారు. మెయిన్ డోర్ నుంచి కాకుండా, విఐపి ఎంట్రెన్స్ నుంచి లోపలికి వెళ్లాము. గెస్ట్ రూంలో సుబ్బలక్ష్మిగారి బృందం వున్నారు.

సుబ్బలక్ష్మిగారు, సదాశివంగారు, వాళ్ల కూతురు రాధ వున్నారు. వాళ్లందరూ చెల్లెమ్మ అవ్వని ఆప్యాయంగా పలకరించారు.

చెల్లెమ్మ అవ్వ వంగి సుబ్బలక్ష్మిగారు, సదాశివం గారి కాళ్లకు మొక్కి ఆశీర్వాదం తీసుకుంది.

"ఇవరు... నీంగ తంబి అయ్యర్ ఫ్రెండ్ లక్ష్మయ్య నాయుడు వోడ పొండాట్టి. ఇవన్ మరుమగన్," అని మమ్మల్ని పరిచయం చేసింది.

మేము వాళ్లిద్దరికి నమస్కారం చేశాము.

ఇంతలో అక్కడికి పివిఆర్కే ప్రసాద్‌రావుగారు వచ్చారు. వాళ్ల కాళ్లకు నమస్కరించాడు. వాళ్లపట్ల ఎంతో గౌరవమర్యాదలను, భక్తిప్రపత్తులను ప్రదర్శిస్తూ సుబ్బలక్ష్మిగారిని కచ్చేరి చేయమని ఆహ్వానించాడు.

మేము వెళ్లి విఐపి ఏరియాలో కూర్చున్నాము.

ఆ సదస్సులో ఒకవైపు స్త్రీలను, ఒకవైపు పురుషుల్ని వేరు చేశారు. మధ్యలో విఐపీలు వెళ్లడానికి దారి వదిలేశారు. స్టేజ్ ముందు ప్రముఖులు కూర్చోవ డానికి మెత్తని బూరుగుదూది పరుపులు పరిచారు.

ఫాన్స్ అన్ని ఆన్ చేశారు. శబ్దం చేయకుండా తిరుగుతున్నాయి.

ఆ సదస్సు గోడలకు వేంకటేశ్వరస్వామి చరిత్రని తెలియజేస్తూ పెయింటింగ్స్ చిత్రించారు. పుట్టలో పాలు తాగుతున్న శ్రీనివాసుడ్ని, గొల్లవాడు గొడ్డలితో కొట్టబోతున్న దృశ్యం, పద్మావతిదేవిని ఏనుగు తరుముతున్న దృశ్యం, పార్వతి, పరమేశ్వరులు, బ్రహ్మ, సరస్వతీదేవి, నారద, తుంబురులు, దేవతల సమక్షంలో పద్మావతి, శ్రీనివాసులు కళ్యాణం, ఇలాంటి దృశ్యాలెన్నో చిత్రించి ఉన్నాయి.

సదస్సు ఆ రోజు జనంతో క్రిక్కిరిసిపోయింది. ఇసుకవేస్తే రాలనంత జనం. కూర్చోవడానికి ప్లేస్ చాలక నిలబడి చూస్తున్నారు.

మా ఇడ్లీ అవ్వ, చెల్లెమ్మ అవ్వ ఆడవాళ్ల వైపు పరిచిన పరుపులుమీద కూర్చున్నారు. నేను పొయ్యి పురుషులవైపు పరిచిన పరుపులు మీద కూర్చున్నాను.

నా ముందు వరుసలో సదాశివంగారు కూర్చు న్నారు. ఆయన పక్కన పివిఆర్కే ప్రసాద్‌రావు గారు,పెద్దలు,ప్రముఖులు కూర్చున్నారు.

సుబ్బలక్ష్మిగారు స్టేజ్ పైకి రాగానే పక్క వాయిద్యాలు వాయించేవాళ్లు పైకిలేచి ఆమెకు నమస్కరించారు.

ఆమె వాళ్లకు నమస్కరించి, ప్రేక్షకులకు వైపు చూసి మళ్లీ నమస్కారం చేసి మైకు ముందు కూర్చుంది. ఆమె పక్కన కూతురు రాధ వీణాని పట్టుకుని కూర్చుంది.

ఆమెకు కుడి, ఎడమల వయోలిన్, మృదంగం వాయించే వాళ్లు కూర్చున్నారు. పక్కన ఘటం వాయించే అతను కూర్చున్నారు. అందరి ముందు మైకులుఉన్నాయి.

కచ్చేరి ప్రారంభమైంది.

రాధ వీణతీగల్ని మీటింది. పక్కవాయిద్యాలు ప్రాణం పోసుకున్నాయి.

సుబ్బులక్ష్మి గారు మొదటగా విఘ్న వినాయకుడ్ని స్మరిస్తూ ముత్తుస్వామి దీక్షితార్ కీర్తనని ఎత్తుకున్నారు.

*హంసధ్వని రాగం.ఆదితాళం.*

*వాతాపి గణపతిం భజే హం*
*వారణాస్యం వరా ప్రదం*
*శ్రీ వాతాపి గణపతిం భజే హం.*
*భూతాధి సంసేవిత చరణం.*
*భూత భౌతిక ప్రపంచ భరణం*
*వీతరాగిణం వినుత యోగినం విశ్వకారణం*
*విఘ్న వారణం. గణపతిం భజే హం*

కీర్తనని పూర్తి చేసేసరికి కరతాల ధ్వనులతో సదస్సు మారుమోగిపోయింది.

తరవాత పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్ కీర్తనని తీసుకుంది.

కథనకుతూహలం రాగం.ఆది తాళం.

*రఘువంశ సుధాంబుధి చంద్ర శ్రీ*
*రఘువంశ సుధాంబుధి చంద్ర శ్రీ*
*రామ రామ రాజేశ్వర రఘువంశ*
*సుధాంబుధి చంద్ర శ్రీరామ రామ*
*రాజేశ్వర రఘువంశ సుధాంబుధి చంద్ర శ్రీ*
*అఘ మేఘ మారుత అఘ మేఘ*
*మారుత శ్రీ కర అఘ మేఘ మారుత శ్రీ*
*కర అఘ మేఘ మారుత శ్రీ కర*
*అశురేష మ్రిగేంద్ర వర జగన్నాథ అశురేష మ్రిగేంద్ర వర జగన్నాథ*

అని పాడుతుంటే సదస్సు అంతా ఊగిపోయింది.

తొడల మీద తాళం వేస్తూ, తలలు ఊపుతూ ఒక పారవశ్యంలో ఉండిపోయారు.

ఘటం, మృదంగం, వయోలిన్ ఆమె గొంతుతో పాటూ జుగల్ బందీ చేసినట్టు పక్కవాయిద్యాలు శివతాండవం ఆడాయి.

ఈ కీర్తనని ఆలాపిస్తున్నప్పుడు ద్వారం దగ్గర తొక్కిసలాడుతున్న జనం మధ్యలో ఒక అతను నిలబడి వింటున్నాడు. అతడ్ని ఎక్కడో చూసినట్టు అనిపించింది.

కళ్లు మూసుకుపోయేట్టు నామాలు దిద్దుకున్నాడు. అయ్యంగార్ సంప్రదాయ పద్ధతిలో పచ్చంచు నూలు పంచె కట్టుకున్నాడు. భుజంమీద ఎర్రని కాశీ తువ్వాలు వేసుకున్నాడు. ఒంటిపై జంధ్యం వుంది.

నల్లని జుత్తు భుజాల మీద పడుతోంది. చేతిలో పసుపు సంచిని పట్టుకున్నాడు.

ఎవరో అయ్యంగార్ అయ్యి ఉంటాడు. అతని ముఖం ఎంతో కళగా వుంది. నన్ను ఎందుకు ఆకర్షించాడో తెలీదు.

తరవాత ముత్తుస్వామి దీక్షితార్ రాసిన తమిళ కీర్తన పాడింది.

*కుఱై ఒన్రుం ఇల్లై మఱైమూర్తి కన్నా,*
*కుఱై ఒన్రుం ఇల్లై కన్నా,*
*కుఱై ఒన్రుం ఇల్లై గోవిందా*
*కన్నుక్కు తెరియామల్ నిర్కిన్రాయ్ కన్నా*
*కన్నుక్కు తెరియామల్ నిన్రాలుమేనక్కు*
*కుఱై ఒన్రుం ఇల్లై మఱైమూర్తి కన్నా*
*వేణ్డియతై తందిడ వెంకటేశ*
*నేన్రిరుక్క వెండియ*
*తు వేరిల్లై మఱైమూర్తి కన్నా,*
*మణివన్నా మలయాప్పా*
*గోవిందా గోవిందా*

అని పాడింది.

నేను ఆ అయ్యంగార్ ని చూశాను.

ఆ కీర్తనని వింటూ తాదాత్మ్యం చెందాడు. ఒక ఆనందంలోవున్నాడు. ఒక మైకంలో ఉండిపోయడు.

తరవాత త్యాగరాజు కీర్తన పాడింది.

గౌలిపంతు రాగం. ఆది తాళం.

*తెర తీయగ రాదా, తెర తీయగ రాదా,*
*తెర తీయగ రాదా, నాలోని తెర తీయగ రాదా,*
*నా లోని మత్సరమను తెర తీయగ రాదా,*
*తిరుపతి వేంకటరమణ తెర తీయగ రాదా,*
*పరమ పురుష ధర్మాది మోక్షముల*
*పార దోలుచున్నది. నా లోని తెర తీయగ రాదా,*
*తిరుపతి వేంకటరమణ తెర తీయగ రాదా*

అని పాడుతుంటే ఆ ఆనందవే వేరు. త్యాగరాజే కూర్చుని పాడుతున్నట్టు ఉంది.

నా చూపు ఎందుకో మాటిమాటికి అయ్యంగారు వైపు వెళుతోంది. ఈసారి అతను నన్ను గమనించాడు. రమ్మని పిలిచాడు. పసుపు సంచిలోని తులసి మాలను తీసి నాకు చూపిస్తూ, ఈ మాల తీసుకెళ్లి సుబ్బలక్ష్మిగారికి ఇవ్వు అని సైగ చేశాడు.

నేను అతని దగ్గరకు వెళ్లి ఆ మాలను తీసుకున్నాను. మాలతో పాటూ ఒక చీటి ఇచ్చాడు.

“ఈ చీటిలో నేను రాసిన కీర్తనని పాడమను. ఈ తులసిమాల ఆమెకు బహుమతిగా ఇవ్వు,” అని చెప్పాడు.

మాల తీసుకుని సుబ్బలక్ష్మి అవ్వకు ఇచ్చి, ఆ అయ్యంగార్‌ని చూపించాను.

“అంద అయ్యంగార్ ఉనక్కు కుడతాచ్చి పాటి, తులసిమాల,” అని చెప్పాను.

ఆయన్ని చూసి నమస్కరించి, తులసిమాల తీసుకుని కళ్ల కద్దుకునింది. ఆ మాలని రాధకు ఇచ్చి, చీటి తీసి చూసింది.

ఆ చీటిలో తెలుగులో ఏమో రాసి ఉంది.

సుబ్బలక్ష్మిగారికి తెలుగు చదవడం రాదు. నాకు చదవమని ఇచ్చింది. ఆ చీటిలో తెలుగు అక్షరాలు ముత్యాలను పేపర్ మీద పొదిగినట్టు రాసివున్నాయి.

అది అన్నమాచార్య కీర్తన.

ఆ అయ్యంగార్ కోరిక మేరకు ఆ కీర్తన పాడింది.

*తందనాన అహి తందనాన పురె,*
*తందనాన భళా తందనాన.*
*బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే,*
*పరబ్రహ్మమొక్కటే, పరబ్రహ్మమొక్కటే.*
*కందువగు హీనాధికములందు లేవు.*
*అందరికి శ్రీహరే అంతరాత్మ,*
*ఇందులో జంతుకులమంతానొక్కటే,*
*అందరికి శ్రీహరే అంతరాత్మ.*
*నిండార రాజు నిద్రించు నిద్రయును ఒకటే,*
*అంటనే బంటు నిద్ర అదియు నొకటే,*
*మెండైన బ్రాహ్మణుడు మెట్టుభూమి యొకటే,*
*చండాలుడుండేటి సరిభూమి యొకటే*

అని పాడింది.

ఆ అయ్యంగార్ ఆ కీర్తన విని వెళ్లిపోయాడు.

నేను బయటకొచ్చి చూశాను. గబగబా సదస్సు రాతి మెట్లు దిగి, గుళ్లోకి వెళుతూ కనిపించాడు. పరిగెత్తుకుంటూ పొయ్యి మహాద్వారం దగ్గర ఆయన్ని ఆపి అడిగాను.

“నిన్ను ఎక్కడో చూశాను. గుర్తుకు రావడం లేదు,” అన్నాను.

”నేను గుళ్లో వుంటాను. ఎమ్మెఎస్ సుబ్బలక్ష్మి గారి గానం అంటే ప్రాణం. త్యాగరాజు,అన్నమాచార్య, వెంగమాంబలాంటి వాగ్గేయకారులు అంటే ఎంత ఇష్టమో, ఈమె అన్న అంత ఇష్టం. అందుకే నేనే గుళ్లో నుంచి వచ్చి, ఈ జనంలో నుంచోని విన్నాను. వాగ్గేయకారులు అందరూ నా ముందు నిలబడి పాడారు. నేను ఆమె ముందు నిలబడి విన్నాను,” అని చెప్పాడు.

“గుళ్లో నిన్ను ఎప్పుడూ చూడలేదే?”

“నీకు నా ప్రసాదాల మీద ఉన్న అక్కర నామీద ఎక్కడ వుంది?”

“నువ్వు పెద్ద దేవుడైనట్టు చెపుతున్నావే?”

“నేను దేవున్నో, దెయ్యాన్నో నీకు కొద్దిసేపటిలో తెలుస్తుంది,” అన్నాడు.

“ఏం మహత్యం చేస్తావు?”

“మహత్యాలు ఎందుకు నాయనా. ఈ కచ్చేరి అయిన తరువాత మీ అయ్యర్ తాత ఇంటికి పొయ్యి చూడు. మీనాక్షి ఆవు వచ్చి వుంటుంది. నా మహత్యం ఏంటో అప్పుడు నీకు తెలుస్తుంది,” అన్నాడు.

నేను ఆయనవైపు అదోలా చూశాను.

ఆ కచ్చేరి అయిపోయిన తరవాత అయ్యంగార్ తాత ఇంటికిపొయ్యి చూస్తే మీనాక్షి ఆవు వచ్చి వుండాది. సుందరేశ్వరుడితో పాటూ, మీనాక్షి ఆవు కూడా ఉంది.

ఆ అయ్యంగార్‌ని తలుచుకునేసరికి ఒళ్లు జలదరించింది.

*తానాపత్రిక కోసం ప్రత్యేకంగా రాసిన కథ*

# FIA HOME FOODS ™®

we love food



It all started with the passion for food and a simple idea. Within each individual home is a unique tradition and way of cooking, using age-old ingredients and recipes passed down to generations with love and care. We gathered a team of inspirational women to share and create their own recipes to bring back those nostalgic flavours to you.

Our idea is to deliver this love and care to your homes, in the form of our mouth-watering and remarkably fresh range of sweets, savouries and pickles. Just one taste will take you back to your sweet childhood memories and that's our guarantee!

Foodies In Andhra #Luv Fia



TO ORDER FROM OUR EXQUISITE HANDMADE RANGE OF FOOD VARITIES PLEASE VISIT OUR WEBSITE

www.fiahomefoods.com








# ఏవో......కొన్ని గుర్తొస్తున్నాయి

## వంశీ — ఆలాపన 3





నిజమే.

ఎక్కడన్నానో గుర్తులేదుగానీ, అన్నాను.

తేనెటీగలు, నేరేడుపూల మకరందాన్ని తాగి పట్టుపెడితే ఆ తేనె రుచితో పాటు వగరుగా కూడా ఉంటుంది. అరకులో ఆలాపన సినిమా షూటింగ్ జ్ఞాపకాన్ని నేనెప్పటికీ మర్చిపోవడం కుదరదు. హీరోయిన్‌కి క్లాసికల్ డాన్స్ నేర్పించిన ఆనంద్ అనే ఆ మాష్టార్నే ఈ సినిమాకి కొరియోగ్రాఫర్‌గా పెట్టేను అయితే, కెమెరా ఆన్ అయ్యాక ఆర్టిస్టుకి ఒన్, టూ చెప్పడం రాదాయనకి. చాలా మంచోడైన ఆయన్ని, 'ఇదేంటి మేష్టారూ?' అంటే ఆవర్దాలు అంటూ ఏదో నాకర్థంగానివి చెబుతున్నాడు. మరైతే, అసిస్టెంట్ శ్రీపద్మ పక్కనే ఉండటంవల్ల ఏ ఇబ్బంది లేకుండా బానే అయిపోతుంది మాపని.

ఆవేశమంతా ఆలాపనేలే ఎదలయలో
ఆవేశమంతా ఆలాపనేలే ఉదయినిగా
నాలో జ్వలించే వర్ణాల రచన
నాలో జనించే స్వరాలా

తక్కిన కారెక్టర్లు వస్తాపోతా ఉన్నా హీరోయిన్ మీద తియ్యాల్సిన ఈ పాట షూట్ ఆ మర్నాటినించే. కానీ, ప్రొడక్షన్ మేనేజర్లంతా కట్టగట్టుకుని స్ట్రైక్ చెయ్యడం మొదలెట్టడంతో ప్రాబ్లమ్స్ మొదలైనియ్యి.

చూస్తున్న ఆర్ట్ డైరెక్టర్ యాదూ, రంగంలోకి దిగిపోతా, "మీరు కానియ్యండి మేం చూసుకుంటాం," అనేటప్పటికి, "యాదన్నా," అంటూ ఎప్పుడూ అతని కూడా తిరిగే ఆ డాన్స్ పద్మ అతనికి జోడీగా తయారైపోయింది.

ఎర్రటి డాన్స్ కాస్ట్యూమేసుకున్న హీరోయిన్ భానుప్రియ, వాళ్ల చెల్లెలు శాంతీ, నేనూ ఎక్కిన ఆ కారు ఘాటీలో గిరిజన గ్రామాలైన పానిరంగినీ, భల్లుగుడా, బోసుబెడ దాటుకుని ముందుకెళ్తా గాలి కొండ క్రాస్ చేస్తుంటే ఆ ఆంజనేయస్వామి గుడి చూసి ఆప

మన్న భానుప్రియ, కారు దిగి దణ్ణమెట్టుకు నొచ్చింది. ముందుకు కదిలిన కారు అనంతగిరిలోకి ఇలా ఎంటరైందో లేదో, "నాకు ఆకలేస్తుంది," అంది ఆ శాంతి.

అది విన్న నేను ఆ వైజాగ్ డ్రైవరైన నరశింహతో, "ఈ ఊళ్లో మొన్నెళ్లేం గదా శంకరవిలాస్ అక్కడాపు," అన్నాను.

ఆ చిన్ని షెడ్డులాంటి దాంట్లోకి దూరిన మమ్మల్ని, ''వాంగో ...వాంగో'' అంటూ చాలా ఆదరంగా ఎదురొచ్చిన ఆ తమిళంవాళ్లు ఇంతా అంతా గానంత ప్రేమతో పెట్టడం మొదలెట్టేరు. చెప్పాలంటే వాళ్లు పెట్టడం కంటే ప్రేమగా ఆ తమిళంలో మాటాడ్డమే ఎక్కువైంది. ఇంతాఅంతా గానంత ఇదిగా వాళ్లతో కల్సిపోయిన హీరోయిను అక్కాచెల్లెళ్లు తెలుగు కంటే మా గొప్పగా వాళ్ల తమిళంలో మాటాడేస్తా వాళ్ల వంటగదుల్లోకదీ దూరిపోతూ ఆ కాసేపట్లోనే ఆ హొటలోళ్లకి మంచి ఫ్రెండ్సయిపోయేరు.

అవతల మాకు షూటింగుందంటున్నా వదలడంలేదీళ్లిద్దర్నీ.

కాసేపయ్యేకా బయల్దేరిన మా కారు మలయ గూడా జంక్షన్నించీ ఎడంపక్కకి తిరిగి ఆ కొండదారిలో ముందు కెళ్తా బొర్రాగుహలు రైల్వేస్టేషను దగ్గరాగిన కాసేపటికే షూట్ మొదలైంది.

ఆ క్లాసికల్ డ్రెస్‌లో డాన్స్ మూమెంట్ షాట్స్. ఆగకుండా ఇంకా ఏంటేంటో షాట్స్ తీసుకుంటూ పోతున్నాం.

ఆ మహారణ్యం మధ్యలో వేసిన రైల్ ట్రాక్ మీదలా షూట్ చేస్తుంటే ఒక్క మేంతప్ప నరుడన్నవాడు కనపడ్డంలేదు. చాలా పొడుగాటి కొండని దొలిచి తవ్విన ఆ టన్నెల్ మధ్యలోంచి నడుచుకుంటూ వెళు తున్నట్టుంది. ఆ ఎరుపురంగు క్లాసికల్ డాన్స్ డ్రెస్‌లో భానుప్రియ, చుడీదార్‌లో ఉన్న వాళ్ల చెల్లి ఆ చీకట్లో పట్టాల మీంచి వెళ్తుంటే వాళ్లకి కాస్త దూరంగా పట్టాల మధ్య కంకర్రాళ్ల మీద నడుస్తున్న మామీద ఆ కొండ రాయి మీంచి చుక్కలుగా నీళ్లు మా నడినెత్తిమీద పడ్తుంటే... ఏంటేంటో ఆలోచనలు. వాటిలో జననం మరణానికి సంబంధించినవీ ఈ నిశ్శబ్దంలో పాటల్లా విని పిస్తున్నాయా కొండగుహలో. కొన్ని అర్థమయ్యేవీ కొన్ని అర్థంగానివీ.

అసాధారణ ప్రతిభగల ఆస్కార్ వైల్డ్ అన్న మాటలు- పుట్టిన ముసలి ఆత్మకి పెరిగేకొద్దీ యవ్వనం వస్తుంది. జీవితంలో ఆనందకరమైన విషయం అదే. తాజాగా యవ్వనంతో మొదలయ్యే శరీరం క్రమంగా ముసలిదైపోతుంది. జీవితంలో విషాదకరమైన విషయం అదే.

"ఇప్పుడీ టన్నెల్‌కీ దీని తర్వాతొచ్చే టన్నెల్‌కీ మధ్య ఏమాత్రం దూరం ఉండదు. అయితే మధ్యలో చాలా పెద్ద అగాధం. కుడిపక్కనున్న కొండమీంచి జలధార పడుతూనే ఉంటదెప్పుడూ," అన్నాడు మా పక్కనే ఉన్న ఆ పట్నాయక్.

పెద్దపెద్ద చప్పుళ్లు చేస్తా పడుతున్న ఆ నీళ్లనే చూస్తుంటే అప్పుడెప్పుడో తలకోనలో శివుడి తల మీంచి జారిన జలాలు గుర్తుకొస్తున్నాయి.

తలెత్తి అలా చూస్తున్నాను. వర్షాలు పడే రోజుల్లో అయితే ఈ రైలుపట్టాల మీదపడే ఆ నీళ్లు అలాంటి లాంటి అల్లరి చెయ్యవంట. ఈ పట్టాలమీంచి వచ్చే పోయే రైళ్లు ఏకంగా స్నానాలు చేస్తా వెళ్లాల్సిందేనంట.

అవేవో కొరుక్కు తింటా ఆ రైలు పట్టాలమీదున్న కోతులు వస్తున్న మమ్మల్ని చూసి కేర్‌కేర్‌మంటూ అల్లరి చేస్తా, ఆపక్కకీ ఈపక్కకీ పరిగెడ్తున్నాయి. కొండ మీదున్న ఆ ముసలి కోతి తన కాళ్లని దువ్వుతుంటే రెండు మూడు రాళ్లు కిందపడ్డాయి. వాటినే చూస్తున్న పట్నాయక్, "వీటితో చాలా ప్రమాదం తెల్సాండీ?" అన్నాడు.

ఇంకొంచెం ముందుకెళ్లాక ఆ రైలుపట్టాల కిందున్న ఆ అగాధాన్ని చూపిస్తా, "చూడండి. ఆ పొదల మధ్యలో పడిపోయున్న ఒక రైలింజను కనిపించడం లేదా మీకు?" అన్నాడు.

చూసిన రఘు, "ఆ ఆ కనిపిస్తుంది. మరి పైకి తియ్యలేదేంటి దాన్ని ?" అన్నాడు.

నవ్వేసిన పట్నాయక్, "ఆ అగాధంలోంచి తియ్యడం ఎవరివల్లాగాక దాని పార్టులు మట్టుకి తీసేసి బాడీనలా వదిలేశారు," అన్నాడు.

"అసలేవయ్యిందీ?" అన్నాడు రఘు.

"అయ్యిందంతా ఈ కోతులు చేసిన గత్తరివల్లే," అన్నాడు పట్నాయక్.

"ఏం గత్తరి చేసినియ్యి?" అన్న మాకు చెప్పడం మొదలెట్టాడా రైల్వే ఎంప్లాయైన బీపిఎస్ పట్నాయక్.

"పందొమ్మిది వందల డెబ్బైతొమ్మిదిలో కిరండోలు నించి ఐరనోర్ అదే ఇనపఖనిజం లోడ్ చేసుకున్న ఆ గూడ్సు మూడు ఇంజన్లు బిగించుకుని వస్తుంది. బొర్రాగుహలు స్టేషను దాటేటప్పటికి బాగా రాత్రయ్యింది. ఆ టన్నెల్ దాటుతున్నపుడు పై నుంచి కోతులు తోసేసిన ఆ పెద్ద బండరాయి పట్టాల మధ్య పడుంది. చాలా టన్నుల బరువున్న ఆ రాయిని చూసిన ఇంజన్ డ్రైవర్ పెంటయ్యకి అర్థమైపోవడంతో ఇంజన్లోంచి బయటికి దూకేశాడుగానీ అతని అసిస్టెంటైన పైడితల్లి మాత్రం దూకలేక అందులోనే ఇరుక్కుపోయాడు.

"అంతే. ఇంజన్లతోపాటు ఈ లోయలో పడిపోయిందా మూడు ఇంజన్లలో ఒక ఇంజను. లోపలే ఇరుక్కుపోయి ఇంకా ప్రాణాల్తో ఉన్న ఆ పైడితల్లిని హాస్పిటల్లో చేర్చారు.




"అతన్ని పరామర్శించడానికొచ్చిన ఆ పై అధికారులతో, 'నేనింక ఎక్కువ రోజులు బతకను. నా కొడుక్కి ఉద్యోగం ఇవ్వండని,' బతిమాల్తే టీసీ జాబు ఇచ్చారా పైడితల్లిగారబ్బాయికి. ఆ తర్వాత ఆ హాస్పిటల్లో చాలారోజులు పోరాడిన పైడితల్లి, అదృష్టం కొద్దీ కోలుకుని మళ్లీ ఉద్యోగంలో చేరాడు.

"యాక్సిడెంట్లో ఎవరైనా చనిపోతే వాళ్ల మనిషికి ఉద్యోగం ఇవ్వడం మామూలు. అయితే, ఇలా ప్రాణాపాయంలో ఉన్న మనిషి పరిస్థితి గమనించి వాళ్ల మనిషికి పనివ్వడం రేర్ కేసు.

"ఆ తండ్రీ కొడుకులిద్దరూ ఉద్యోగాలు చేసుకుంటున్నారు. టీసీగా చేస్తున్న కొడుకు ఏదో జబ్బు చేసి చిన్నవయసులోనే చనిపోతే తండ్రి పైడితల్లి మట్టుకి నార్మల్‌గానే రిటైరయ్యాడు."

కళ్లకి కట్టినట్టలా అతను చెప్పుకుంటా పోతుంటే అతని మాటల్తో కడుపు నింపుకున్న మాకు అన్నాలు లేవాపూట.

'అలపైట వేసే సెలపాట విన్నా, గిరివీణ మీటే జలపాతమన్నా నాలోన సాగే ఆలాపనా...' అన్న లైన్స్ మీద షాట్ తియ్యడానికి ఆలోచిస్తా రఘువేపు చూసేను.

అర్థం చేసుకున్న అతను కెమెరాలో వైడ్ యాంగిల్ లెన్స్ వెయ్యమని తాళ్లు కట్టుకుని ఆ అగాధంలోకి దిగేడు. భానుప్రియనీ, మోహన్నీ ఆ బ్రిడ్జీ పైనుండమని ఆ లోయాంగిల్ షాట్ తీసి పైకొచ్చాక అక్కడ్నించి మిగతా షాట్స్ తీసుకుంటూ ఆ అడివి లోపలెక్కడో ఉన్న చిమిడిపల్లి అన్న ఆ స్టేషన్లోకొచ్చేం.

స్టేషన్ మాష్టారూ ఒకళ్లిద్దరు స్టాఫూ మాత్రం ఉన్న ఆ అతి చిన్ని స్టేషను అడవిలోంచి తీసుకెళ్తా నడిదారిలో వదిలెళ్లిపోయిన ఒంటరి మనిషిలాగుంది.

మమ్మల్ని చూసిన స్టేషన్ మాష్టారు శివరాజు ఎదురుచూస్తున్న ఆత్మీయుడ్లా వచ్చేసేడు. ఆ తర్వాత ఆ ఇద్దరాడోళ్లనీ వాళ్ల క్వార్టర్స్‌లోకి తీసుకెళ్లి భార్య దగ్గర పెట్టేడు.

అదో పనిష్మెంటు స్టేషనంట. ఇక్కడ్నించి బయటికెళ్లాలంటే ఆగే రైలు తప్ప ఇంకోదారి లేదంట.

ఈ అడివిలోపల జరిగిన కథలు చెబుతుంటే రాత్రి కూడా ఏం తినబుద్ధేసేలా లేదు మాకు.

తన అసిస్టెంటైన అప్పలనర్సుని పిల్చి ఇక్కడ దొరికే మేకపాలతో మా అందరికీ టీ పెట్టిస్తున్న ఆ శివరాజుగారు దేనికోసమో కనిపించిన మనిషి కళ్లలో వెతుకుతున్నట్టు కనిపించారు నాకు.

వాళ్ల క్వార్టర్స్‌లో కెళ్లిన ఆ హీరోయిను అక్క చెల్లెళ్లని సొంత చెల్లెళ్లకంటే ఎక్కువ ప్రేమతో, "ఉప్మా చేస్తా తింటారా?" అందా ఎస్సెమ్‌గారి భార్య లీల.

"ఆకలి మీదున్నాం ఎందుకు తినం... నన్ను ఉల్లిపాయలు కొయ్యమంటారా?" అంది శాంతి.

"బాత్రూమెక్కడా... ఉతికిన చీరొకటిస్తారా స్నానంచేసి మేవెళ్లేదాకా అది కట్టుకుంటాను," అంది భానుప్రియ.

"అలాగే," అంటా ఆ అక్కచెల్లెళ్లకి ఏం కావా లంటే అది చేసిపెట్టేస్తున్న ఆ లీలగారికేసి చూసిన భాను, "నా సినిమాలు ఏమేం చూసేరు?" అంది.

ఓ పక్కన ఉప్మా చేసే పనిలో ఉన్న ఆ లీల, "మీ సినిమాలు నేను చూడ్డమేంటీ?" అంది.

"అదేంటీ! నేను సినిమా హీరోయిన్ని తెలుసా?" అందా భానుప్రియ.

తెలీదన్నట్టు నవ్వేసిన లీలగారు, "నేనేం చూడ లేదమ్మా... అసలు మిమ్మల్ని చూడ్డం ఇదే మొదటి సారి," అంది.

"ఔనా!" అంటా షాకైపోయినా అక్కాచెల్లెళ్లు, "మరి మాకోసం అన్నీ ఇంత ఇదిగా చేసేస్తున్నా రెందుకూ?" అన్నారు.

నవ్విన ఆ లీల, "మీలా ప్రేమతో పలకరించే ఒక మనిషి ఇక్కడికొచ్చి ఎన్నాళ్లయిందనీ... అలాగొచ్చా రనే మిమ్మల్నిలాగ చూసుకోడం," అంటా చేసిన ఉప్మాని పళ్లాల్లో వేస్తూ, "ఎప్పుడో ఊర్నుంచి తెచ్చు కున్న ఆవకాయ ఉంది వెయ్యమంటారా?" అంది.

బయట చూస్తే సన్నటి సిరివెన్నెల, చెప్పలేనంత చలిగాలి. వాసనొస్తున్న ఆ స్టేషన బిల్డింగ్ పక్కన మల్లె పందిట్లోకెళ్లి నాలుగుపువ్వుల్ని తెంపి తెచ్చుకుంటున్న నన్ను, "ఈ సినిమా పేరేంటీ?" అన్నారు శివరాజు.

"ఆలాపన."

నవ్వినా శివరాజు, 'రేపు సినిమా ఎలాగుంటదో తెలీదుగానీ పేరు మాత్రం చాలా బాగుంది," అన్నారు.

అంతసేపూ సైలెంట్‌గా ఆకాశంవేపు చూసిన మోహన్ ఆ ఎస్సెమ్ శివరాజువేపు తిరిగి, "ఇప్పుడు ట్రైనేమీ రాదా?" అన్నాడు.

"గూడ్సు ఒకటి ఇప్పుడే శివలింగపురం వది లింది," అన్నా శివరాజు, "మీకు ట్రైను ఎంత లేటుగా వస్తే మాకంత ఆనందం," అన్నారు.

"అదేంటీ అలాగన్నారు?" అన్నాడు రఘు.

"మీలాంటోళ్ల సందడి ఈ స్టేషన్లో చూసి ఎన్నాళ్ల యిందనీ? మీరెళ్లిపోయాక మా బతుకులు మామూలే గదా? ఈ కొండల్లోపల ఈసురోమంటా ఏడవాలి," అన్నారు.

"మరైతే ఎవరూ రారా ఇక్కడికీ?" అన్నాడు మోహన్.

నవ్వినా శివరాజు, "ఎవరొస్తారు? రాత్రుళ్లు ఎలుగుబంట్లు, అప్పుడప్పుడూ చిరుతపులులు తప్ప," అంటా నవ్వి, "ఎప్పుడు ట్రాన్స్ఫర్ అవుద్దా అని చూస్తున్నాం. భీమిలిలో చదూకుంటున్న మా పిల్ల లక్కడ, మేం ఇక్కడ..." అంటుంటే, "అయితే... మీకు భీమిలి తెలుసన్నమాట," అన్నాను.

"మాది భీమిలే. నా వైఫ్‌ది విజయనగరం అవతలున్న నెల్లిమర్ల," అన్నారు.

"చాలా సంతోషవండి. మీ భీమిలిలో ఉన్న ఆ నెల్లిమర్ల జూట్‌మిల్స్ వాళ్ల గెస్ట్‌హౌస్‌లో రెండ్రోజు లున్నాం వెనకటికి," అన్నాను.

చాలా సంబరపడిపోయినా శివరాజుగారు చాలా ఇదిగా మాటాడేస్తుంటే గూడ్సు బండొస్తున్న సంగతి తెల్సింది. లోపలున్న హీరోయినాళ్లకి కబురు చేసే పృటికి కట్టుకున్న చీర విప్పి వాళ్లకిచ్చి, తిరిగి ఆ ఎర్ర డాన్స్ కాస్ట్యూమ్ వేసేసుకుని రెడీ అయిపోయింది.

ఆగిన గూడ్స్ ఇంజన్ డ్రైవర్‌తో మాటాడిన శివరాజు మమ్మల్నందర్నీ టాప్ ఓపెనై ఉన్న ఆ గూడ్స్ పెట్టెల్లో ఎక్కించేక కదిలిందది.

నెమ్మదిగా వెళ్తున్న ఆ ట్రెయిను పెట్టెల్లో కూర్చున్న మమ్మల్ని కొండల్లోంచొస్తున్న చలి ఒకటే ఒణికిస్తుంది. పగలంతా అల్లరిచేసిన కోతులు ఇప్పుడు కనపడ్డంలేదుగానీ లోపలెక్కడో ఏవో అడివి జంతువుల అరుపులు. వెళ్తున్న ట్రైను టన్నెల్లోకెళ్లి నప్పుడల్లా అదేదో వింత హోరు, వింత చలి, వింత హాయి.

బొర్రా గుహలు దాటేసిన గూడ్సు శిమిలిగూడ వేపెళ్తుంటే చుట్టూ ఉన్న ఆ దండకారణ్యంవేపు కల తిరుగుతున్నాయి నా కళ్లు. ఆ కొండల్లో కోనల్లో ఎక్కడో ఒక మినుకుమినుకుమనే దీపం. పట్టాల పక్కనే ఉన్న ఆ పెద్ద చిక్కుడుచెట్టు మీద పక్షి వింత అరుపు. బొర్రా గుహలు స్టేషను దాటేసిన గూడ్సు శిమిలిగూడ వేపు వెళ్తుంటే దూరంగా కనిపిస్తున్న రోడ్ పాయల్లోం చెళ్తున్న లారీ హెడ్‌లైట్లు మంచుపొగల్లో దూసుకు వెళు తున్నాయి.

నా జేబులో వేసుకున్న ఆ తెల్లటి మల్లెపూలని వేళ్లతో బయటికిలాగి గుప్పెట్లో పెట్టుకుని ఇష్టంగా వాసన చూసుకుంటుంటే ఇందాక శివరాజుగారి ఊరు భీమిలి, ఆ తర్వాత చలం, ఆయన కవిత్వం రాస్తున్నా నని చెప్పి రాయని కవిత్వం గుర్తుకొచ్చేస్తుంటే మాసిన నా చొక్కాజేబులో మూలుగుతూ వాసనొచ్చే ఆ మల్లెపూలని చూస్తున్నాను.

సన్నని వెన్నెట్లో
ప్రియురాలి నుదిటికన్న తెల్లగా
యేమి చెయ్యాలో తెలీని ఆనందంతో
గుండెపట్టి చీలికలు చేసే మల్లెపూలు
తెల్లారకట్ట లేచి చూసినా
ఇంకా కొత్త పరిమళాల్తో
రాత్రి జ్ఞాపకాలతో
ప్రశ్నించే మల్లెపూలు

*

అరకు స్టేషన్లో ఆ గూడ్సు ఆగిన వెంటనే అంతా దిగిపోయేం.

స్టేషన్‌కి దగ్గర్లోనే ఉన్న రైల్వే గెస్ట్‌హౌస్‌లో తన రూమ్ అవడంతో గబగబా నడుచుకుంటూ వెళ్లిపో యేడా హీరో మోహన్.

స్టేషన్ బయటికొచ్చేం. ప్రొడక్షన్ మేనేజర్స్ స్ట్రైక్ వల్ల కార్లు రాలేదు. ఏం చెయ్యాలా అని ఆలోచిస్తుంటే ఎవరి మానాన వాళ్లు నడుచుకుంటూ వెళ్లిపోడంతో నిమిషాల్లో ఖాళీ అయిపోయిందక్కడ.

ఇటుపక్కకి తిరిగి చూస్తే ఎర్రటి డాన్స్ డ్రెస్ వేసుకుని నిలబడ్డ భానుప్రియ కనిపించలేదు. వెతు క్కుంటూ స్టేషన్లోకెళ్లి మళ్లీ బయటికొచ్చి చూస్తే-

ఆ సిరివెన్నెల్లో, మంచుతో కప్పడిపోయి ఉన్న ఆ అరకులోయలో ఒంటరిగా నడుచుకుంటూ వెళ్లి పోతున్న భానుప్రియ కనిపించింది.

సినిమా షాట్లు పెట్టడం అలవాటైపోయిన నాకు తను ఫార్టీ ఎయిట్ ఫ్రేమ్స్ స్లోమోషన్లో వెళ్తున్నట్టు అనిపించడంతో అలా చూస్తానే ఉన్నాను.

*

తర్వాత షెడ్యూలు వైజాగ్‌లో మొదలైంది. అక్కడ షూట్‌కి కావల్సింది ముగ్గురే ఆర్టిస్టులు. ఈ సినిమా నిర్మాతైన పెళ్లకూరు అమరేంద్రరెడ్డిగారిది నెల్లూరు. ఈ విశాఖపట్నంలో తెల్సినోళ్లెవరూ లేరు. దాంతో ఈ ఆలాపనకి ఈ జిల్లా హక్కులు కొన్న విజయలక్ష్మీ ఫిలింస్ రాజుగారూ, ఎస్‌కోట అప్పారావూ లోకల్‌గా మాకు కావాల్సిన సాయాలు చేస్తా ఫస్ట్ షెడ్యూల్లో మాకు అప్పగించిన ఆ రైల్వే మనిషైన జిఎన్ మూర్తిని మాతో కంటిన్యూ కమ్మన్నారు.

ఈ వైజాగులో అయ్యేకా, అక్కణ్నించి ఆప్తమయి అయిన అరకులోయకి మా ప్రయాణం.

జనవరి అవ్వడం వల్ల అంతకు ముందు పల్చని గ్లాస్కో చీర మందానుండే మంచుతెరలు ఇప్పుడు మెట్టూరు మల్లు దళసరికి పెరిగినియ్యి. ఇంకో పక్క నించి ముమ్మరంగా చలి. పళ్లూ అవీ ఎట్టి పరిస్థితు ల్లోనూ ఫ్రిజ్‌లో పెట్టక్కర్లేదు.

ఈసారి హీరోయిన్‌గారి మకాం మా జిల్లాపరిషత్ గెస్టహౌస్‌లో కాదు. ఈ అరకులోయ వరకూ సకల సౌకర్యాలూ గల రైల్వే గెస్టహౌస్‌లో. ప్రపంచం మొత్త మ్మీద మనిషిలో ఆత్మీయత చూడాలంటే గుడిపాటి వెంకటాచలంగారి తర్వాత ఈ గెస్టహౌస వాచ్ మేన్ 'మంగూలీభాయ్'లో. అసలలాంటి మనిషిని ఇంకె ప్పుడూ, ఇంకెక్కడా చూడం. సాటి మనిషంటే అంత ప్రేమ. అతని చిరునవ్వు చాలు. అతని ఒణికే చేతుల్తో ఇచ్చే ఆ గాజుగ్లాసుడు మంచినీళ్లు చాలు. ఒకసారి పిడబ్ల్యుఐ జగన్నాథంగారింట్లో షూట్ జరుగుతున్న ప్పుడు ఆ గెస్టహౌస్‌లో కెళ్తుంటే ఈసారి వాళ్లన్నయ్య గోపీతో పాటొచ్చిన భానుప్రియ, 'నా జీవితంలో రిటైరయ్యి కాపురం పెట్టినప్పుడు మా ఇంట్లో పనికి ఈ మంగూలీభాయ్‌ని తీసుకెళ్లిపోతాను,' అనడం విన్నాను. అతని తర్వాత ఆ గెస్టహౌస్‌లో మాగొప్పగా వంటలు చేసే 'హంస' అనే ఆ ఒరియా వంటోడు తన రుచుల్తో అక్కడ దిగిన ఎంతోమంది రైల్వే ఆఫీసర్లని పడిపోయేలా చేస్తున్నాడు. తిన్న ప్రతిదాని రుచి తాలూకు రెసిపీ రాసేసుకుంటున్నారా ఆఫీసర్ల భార్యలు. ఆఖరికి ఇడ్లీల్లో అల్లప్పచ్చడితో సైతం. అంత మందినలా పడగొట్టేస్తున్న ఆ హంసకి ఈ సినిమా వాళ్లెంత? ప్రతిరోజూ ఏదో ఒక వంట అతన్తో చేయిం చుకుని పరమ ఇష్టంగా తింటుందా భానుప్రియ.

శివుడు ఆ ఉష కళ్లలోకి చూసిన వెంటనే ఒకా నొక ఆవేశం పూనకంలా రావడంతో 'ఆ కనులలో కలల నా చెలీ!' అంటూ అందుకునే ఆ పాటతో మర్నాడు షూట్ మొదలౌతుంది.

రేపు హీరోయిన్ వేసుకోబోయే ఆ నల్లటి డాన్స్ కాస్ట్యూమ్, దానిమీద నగలూ పట్టుకొచ్చిన హీరోయిన్ పర్సనల్ కాస్ట్యూమర్ బాబు నా గదిలోకి తీసుకొచ్చి ఆ తెల్లటి పరుపుమీద పరుస్తా, "ఈ నల్ల డ్రస్సూ, నగలూ చేయించడానికి మీరెంత కష్టపడ్డారూ?" అంటున్నాడు.

ఔను... ఉత్సవ్ సినిమాలో రేఖ వేసుకున్న బ్లాక్ కాస్ట్యూమ్ లాంటిదీ హీరోయిన్‌కి వేసి అరకు కన్య




ఒళ్లో ఎలాంటెలాంటో షాట్స్ తీయాలని ఎన్నో కలలు గన్నాను. మరి నా కలలు నిజమౌతాయా?... చూడాలి రేపట్నుంచి.

మర్నాడు పొద్దుటే ఆ అరకులోయ దాటి ఘాట్ ఎక్కబోతుంటే వచ్చే పానిరంగిని అన్న గ్రామం దాటేక దారి పక్కనే ఎకరాలకి ఎకరాల్లో బంగారపు రంగు ఒలిసి పూలపంట. దాని మధ్యలో రైలు ట్రాక్.

ఆర్ట్ డైరెక్టర్ యాదుని పిల్చి ఆ ఒలిసిపూల పంట మధ్యలో ఊళ్లో సంపాదించుకొచ్చిన బండి చక్రం బిగించమన్నాను. ఆళ్లాపని చేశాక తిరిగే ఆ చక్రంమీద ఈ నల్లటి డాన్స్ కాస్ట్యూమ్‌తో నిలబడ్డ భానుప్రియ డాన్స్ చేస్తుంటే ఆ శివుడు పాడ్తున్నాడు. సరిగ్గా అదే టైమ్‌కి పట్టాలమీంచి వెళ్తుంది రైలు. ఇలాంటి షాట్స్ ఇంకా కొన్ని కడితే ఎంత బాగుణ్ణు ఈ లోయలో! అంతా రెడీచేసి రైలుకోసం ఎదురుచూస్తుంటే, "అరకు స్టేషనొదిలేసింది రైలు," అంటూ అరిచేడు పట్నాయక్.

అనుకున్నట్టూ షాట్ తియ్యడం అయ్యేక ఆ చక్ర మ్మీద నాట్యం చేస్తున్న భానుప్రియ కళ్లు తిరిగి పడి పోయింది. నిజమే, తిరుగుతున్న చక్రం మీద నిల బడలా నాట్యం చేస్తుంటే ఎంతటోళ్లకైనా ఇలాగే కళ్లు తిరుగుతాయి. ఆఖరికి నాకిష్టమైన ఆ వైజయంతి మాలతో సైతం.

వై. విజయ, దేవదాస్ అరకులోయలో దిగే సీను. పరమ పల్చగా ఉన్న ఆ శిల్కు చీర అరనిమిషానికోసారి అమాంతంగా జారిపోతుంటే ఒక పక్కనించి ఇష్టంగానే దాన్ని చూసుకుంటూ, 'ఈ చీరొకటి జారి చస్తుంది,' అని భరణి రాసిన వై. విజయ మేనరిజమ్ షూటింగ్ జరుగుతున్నప్పుడే పండిపోవడం మొదలెట్టింది. ఒక గ్రామఫోన్ కంపెనీ ఓనరైన ఆ దేవదాస్‌కి దూరంనించి శివుడి వాయిస్ వినిపించింది. కళ్లు మూసుకుని దాన్ని చాలాసేపు విన్న ఆ దేవదాస్, "ఇలాంటి వాయిస్ నా జన్మలో ఎప్పుడూ వినలేదు. ఈ పాడ్తున్నవాడ్ని నాతోపాటు మద్రాసు తీసుకెళ్లిపోయి వీడితో పాడించిన ఆ పాటలు ఎల్పీ రికార్డ్సుగా రిలీజ్ చేస్తే?... అమ్మో! డబ్బేడబ్బు," అంటా ఎగిరి గంతేసి పరుగెడుతున్నాడా దేవదాసు.

ఈ సీన్ తర్వాత 'ప్రియతమా తమ సంగీతం...' అంటా ఆ డముకు వాటర్ ఫాల్స్‌లో శివుడ్ని రెచ్చగొడుతా వై. విజయ పాట.

*

ఆ లోయలో ఆకాశంలో పరుగెట్టే నీలి మేఘం లాగా షూటింగ్ జరుగుతా ఉంటే ఈ ఆలాపన తర్వాత నాతో సినిమా తియ్యబోయే ఆ ముగ్గురు యంగ్ ప్రొడ్యూసర్లు దిగేరు.




సాయంత్రం నా రూమ్‌కొచ్చినాళ్లు, "కమల హాసన్ మనకు డేట్సిస్తాడన్న నమ్మకం పెద్దగా లేదండీ," అన్నారు.

"అయితే మరేం చేద్దామంటారు?" అన్నాను.

"మీరింతవరకూ తీసిన ఒకో సినిమా ఒకో రకం కథతో వస్తుంది... ఈసారేదైనా కొత్త కథతో దిగితే బాగుంటుందనుకునొచ్చాం," అని వాళ్లంటుంటే వాళ్లతో టైటిల్ రిజిస్టర్ చెయ్యమని చెప్పిన రోజు సాయంత్రం గుర్తుకొచ్చింది.

ఆమధ్య నన్ను మద్రాసులో కల్సినవాళ్లలో ఒకరైన రవికిషోర్‌గారు, "రేపు స్రవంతీ మూవీస్ అని మన బ్యానర్ రిజిస్టర్ చెయ్యబోతున్నాం," అన్నారు.

విన్న నేను, "ఈ స్రవంతి అన్న ఐడియా ఎలా వచ్చింది మీకూ?" అన్నాను.

"రాత్రి రైల్లో వస్తున్నప్పుడు మల్లాది వెంకట కృష్ణమూర్తి రాసిన స్రవంతి అన్న నవల చదువుతున్నపుడు," అన్నారు.

"బాగుంది. నాకిష్టమైన రచయిత ఆ మల్లాది గారు," అన్నాను.

"చెప్పాంగదా రిజిస్ట్రేషన్ రేపే," అని రవికిషోర్ గారంటుంటే పార్సన్ కాంప్లెక్స్ దాటబోతున్న కారు సడన్‌గా ఆపమన్నాను.

ఆపినాయనా ఏమైందా? అని చూస్తే రోడ్డు పక్కన పడున్న బర్కిలీ సిగరెట్టు పాకెట్టు ఖాళీడొక్కు కనిపిస్తే తీసుకుని సగానికి చింపాక దాని వెనక పక్కనో టైటిల్ రాసి ఇచ్చాను.

చదివిన కిషోర్‌గారు, "ఏంటిదీ?" అన్నారు.

"పైకి చదవండి," అన్నాను.

"లేడీస్ టైలర్."

"ఈ టైటిల్ మీ బానర్‌లో రిజిస్టర్ చేయించండి," అన్నాను.

"మనం ఆ కమలహాసన్‌తో అనుకుంటున్న కథకీ ఈ టైటిల్‌కీ ఏమాత్రం సంబంధం లేదుగదా?" అన్నారాయన.

నవ్వేసిన నేను, "ఆ లేడీ మనం అనుకుంటున్న కథ సినిమా చేస్తే అదో కావ్యం. ఈ టైటిల్‌కి కథగానీ

చేస్తే మన్మథలీల లాంటి శృంగారకావ్యం," అన్నాను.

జరిగిందంతా గుర్తుచేసుకున్న నేను వాళ్లవేపు చూసి "ఈ సినిమాకి తనికెళ్లభరణి అని కొత్త రైటరు," అంటా అతను రాసిన, 'ఈ పైటొకటి జారి చస్తుంది,' అన్న వై. విజయ మేనరిజం గురించీ, అతనే కన్సివ్ చేసిన ఇంగ్లీషు వీర్రాజు కేరెక్టర్ గురించీ చెప్పి మనిషిగా ఆ భరణి ఎంత ఉన్నతుడో చెపితే చాలా ఇదయ్యేరా ముగ్గురూ.

"మీకు పరిచయం చేస్తాను భరణిని. అన్నట్టు మీరు స్టే చేసింది ఏ గెస్ట్‌హౌస్?" అన్నాను.

వాళ్లలో ఉన్న తమ్ముడు సత్యం అనే అతను కామెడీగా నవ్వేస్తా, "గెస్ట్‌హౌసా పాడా?" అన్నాడు.

అతనలా పాడు అంటుంటే మొన్న పడుకున్న ఆ వల్లకాడు గుర్తొచ్చి ఆ ఇన్సిడెంటు చెప్పేటప్పటికి తెగ నవ్వేసేరంతా.

"సర్లే ఇప్పుడెక్కడ దిగేరు?" అన్నాను.

'రైల్వేస్టేషన్లో ఉన్న రిటైరింగ్ రూమ్‌లో. ఇరవై నాలుగ్గంటల్లో ఖాళీ చేసెయ్యాలంటే ఇప్పుడేం చెయ్యాలో అర్థంగాటంలేదు," అన్నాడు తమ్ముడు సత్యం.

ఆలోచించిన నేను. "అక్కడ కేంటీన్ కాంట్రాక్టర్ ఆకెళ్ల సూర్యప్రకాశరావు అనుంటారు. ఆయన దగ్గర కెళ్లి నేను చెప్పేనని చెప్పండి," అన్నాక, "అయితే... ఆ తనికెళ్ల భరణిని పంపిస్తాను మీ దగ్గరికి," అన్నాను.

"లేడీస్ టైలరన్న టైటిల్ రిజిస్టర్ చేయించారు గదా మాతోటి. దానికి కథేమన్నా ఉందా మీ దగ్గర?" అన్నారు వాళ్లలో ఒకడైన సాయిబాబుగారు.

"మా ఊళ్లో ముమ్మిడివరపు త్యాగరాజని ఒక అరుగుమీద టైలరున్నాడు. నా బాల్యమిత్రుడైన ఆడి ఇన్‌స్పిరేషన్‌తో చిన్న లైను అనుకున్నాను."

"ఏంటదీ?"

"బాగా చేస్తే ఇదో గ్రామీణ వాతావరణంలో శృంగార కథ అవ్వుద్ది వినండి... ఆ కోనసీమ గ్రామంలో ఆడోళ్ల జాకెట్లు మా గొప్పగా కుట్టే ఆ టైలర్‌కి మహా బద్దకం. ఎప్పుడూ నిద్రోతా ఉండే ఆడి దగ్గరికి మారేడుమిల్లి అడవుల్లోంచొచ్చిన ఒక కోయదొర, కుడి తొడ మీద పుట్టుమచ్చ ఉన్న పిల్ల నీకు పెళ్లాం అయితే మహారాజయోగం పడద్ది అనేసి ఈడిదగ్గర డబ్బులు దండుకు వెళ్లిపోయేడు. ఆతర్వాత నించి దడుల్లో స్నానాలు చేస్తున్న ఆడపిల్లల తొడల మీద పుట్టుమచ్చ లెవరికున్నాయా అంటా అసిస్టెంటు సీతారాముడితో పాటు వెతుక్కోవడంతో మలుపులు తిరగడం మొదలవ్వుద్ది కథ..." అంటా ఆగేను.

విన్న ఆ తమ్ముడు సత్యం, "ఇదేదో అర్జంటుగా హిట్టైపోయే ఇంట్రస్టింగ్ సెక్స్ కతలాగుందే," అన్నాడు.

"సరే," అన్నాను.

"వచ్చేటప్పుడు సెంటర్లో కనిపించిన చిన్ని టైలరింగ్ షాపు బోర్డు మీద ప్రొప్రయిటర్ పేరు నాగమణి అని ఉంది. అది హీరోయిన్‌కి పెడదామా?" అన్నాడు.

"హీరోయిన్‌కి సుజాత అని ఫిక్సైపోయేను. కావాలంటే వై. విజయ కేరెక్టర్‌కి పెడదాం," అన్నాను.

హుషారుగా పైకి లేచిన తమ్ముడు సత్యం, "మన సినిమాలో పులుసు కూడా ఉందా అయితే?" అన్నాడు.

అలా భరణిని వాళ్లకొదిలేసిన నేను ఆ ప్రియతమా సాంగ్ తియ్యడంలో పడిపోతా, ఆ సాయంత్రం పనుండి ఆ రైల్వే గెస్ట్‌హౌస్ కెళ్లేటప్పటికి అందులో ఉంటున్న మా జనాల సామాన్లన్నీ బయట పెట్టేస్తున్నారు. వాటిని చూసిన నేను, "ఇదేంటీ?" అన్నాను.

సీరియస్‌గా నా దగ్గరకొచ్చిన ఆ హంస, "ముందే చెప్పాంగదా మా ఆఫీసర్లుగానీ వస్తే అర్జంటుగా ఖాళీ చేయించేస్తాం అనీ?" అన్నాడు.

"వాళ్లొస్తున్నట్టు ముందే తెలిస్తే ఇంకో దారేవన్నా చూసుకుందుం గదా?" అన్నాను.

"మాకు తెలిస్తేగదా మీకు చెప్పడానికి? సడన్‌గా వచ్చాగిపోతాయి వాళ్ల జీపులు," అంటా వెళ్లిపోయేడు.

ఇప్పుడేం చెయ్యాలీ? అనుకుంటుండగా రైల్వే పర్మిషన్లు తెచ్చే ఆ వైజాగు మూర్తీ, పట్నాయకూ కల్సి నా దగ్గరకొచ్చేరు.

"ఏంటీ?" అన్నాను.

"ఈ లోయలో సదానందం అన్న గిరిజనుడికి లాటరీలో లక్షరూపాయిలొచ్చినియ్యి," అన్నాడు పట్నాయక్.

"మా వాళ్ల సామాన్లన్నీ బయటపడేశారు ఇప్పుడేం చెయ్యాలా అని ఆలోచిస్తుంటే మీ ఊరి కతలు చెబుతారేంటీ?" అన్నాను.

"నన్ను కొంచెం చెప్పనియ్యండి సార్," అంటా దగ్గరకొచ్చిన పట్నాయక్, "ఆ డబ్బుల్తో అరుణోదయా అని ఒక లాడ్జి కట్టాడా సదానందం. మనోళ్లందర్నీ అందులో పెట్టేస్తేనో?" అన్నాడు.

"ఇంకేం ఆలోచించకుండా పదండైతే," అంటా అందరి సామాన్లూ ఆ లాడ్జింగు ఇరుకిరుకు రూముల్లో సర్దించేస్తుంటే నాకు కబురుచేసిన భానుప్రియ, "మీ జడ్పీ గెస్టుహౌస్‌లో రూము మళ్లీ దొరకదా?" అంది.

"జిల్లా కలెక్టర్రో, బస్సు కండక్టర్రో ఉన్నారం దులో," అంటా వెళ్లిపోయేను.

*

చాలా ఎత్తైన ఆ గాలికొండ పైదాకా ఉషని తరిమిన బెనర్జీ తన గొడ్డలితో ఆమె తల నరకబోతుంటే అపరకాళి తనమీద పూనినట్టైపోయిన ఆ ఉష ఆ బెనర్జీ గాడి మీద పులిలా కలబడిపోతా ఆడి చేతుల్లో గొడ్డలి లాగేసుకుని ఆడ్ని నరికెయ్యడం, ఆ కొండల్లో మారు మోగేలాగా చావుకేక పెట్టినా బెనర్జీ ఆ గాలికొండ శిఖరం మీంచి కూలిపోయే సీను తియ్యడం కోసం పైకెక్కుతున్నాం.



కొంత దూరం ఎక్కగలిగిన ఆ బెనర్జీ కేరెక్టరేసే ప్రదీప్‌శక్తి, "ఇంక నావల్లగాదు బాబోయ్," అంటా పడిపోతే ఆర్ట్ డైరెక్టర్ యాదూ, అతని అసిస్టెంటు జయా, శ్రీపద్మా ఇంకా మిగతాజనాలంతా అతన్ని పైకి మోసుకెళ్లేటప్పటికి ఎప్పుడొచ్చిందో ఆ పసుపురంగు డాన్స్ కాస్ట్యూమ్ వేసుకునున్న భానుప్రియ వచ్చేసి ఒక మూల నిలబడి ఉంది.

ఆ సీన్ తీసేక ఆ గాలికొండ మీంచి కిందకి దిగడానికి దారి కనిపించింది మాకు. కానీ, చాలా దూరం. సర్లే అనుకుని సగం దూరం నడిచేటప్పటికే చీకటిపడిపోయింది. ఆ ప్రాంతంలో ఎక్కడా ఎప్పుడూ లేనంత హోరుగాలి. నా దగ్గరకొచ్చిన యాదు, "అది గాలికొండ గదా?" అన్నాడు.

ఆ చీకట్లో ఆ కొండ దిగుతుంటే అనిపిస్తుంది నా ఇమాజినేషన్లో. 'చాలా ఎత్తైన ఈ గాలికొండ మీద ఒక ఊరుని నిర్మిస్తే అది గాలికొండపురం అవ్వుద్ది. ఈ గాలికొండపురం మీంచెళ్లే రైల్వే ట్రాకూ, దానికో గేటు అన్న పేరు పెట్టి ఒక క్రైమ్ సస్పెన్స్ నవల రాస్తే ఎలాగుంటదీ?' అనుకుంటూ కిందికి దిగి ఆగున్న కారెక్కేను.

ఆ జెడ్పీ గెస్టుహౌస్‌లో పడుకున్న నాకా రాత్రంతా ఇవే ఆలోచన్లు.

ఒక క్రైమ్ సస్పెన్స్ కథ... దానిపేరు గాలికొండపురం రైల్వేగేటు.

ఏంటో నా మనస్తత్వం! ఒకదాని గురించి ఆలోచిస్తుంటే అసలు దానికి సంబంధించని ఇంకో దాని గురించొస్తుంటాయి ఆలోచన్లు... చిన్నప్పట్నుంచీ ఇంతే. ఆ రాత్రలా ఆలోచిస్తా ఉంటే ఒక చిన్న కథ పుట్టేక అప్పుడు పట్టింది నిద్ర.

*

నిన్న ఉష కట్టుకుని విప్పేసిన ఆ చీరని మాసిన పెట్టెలో పారేస్తే దాన్నో చెట్టుకొమ్మకి చుట్టేశాడు శివుడు.



అలా చెయ్యడం వెనకాల అర్థమేంటంటే స్త్రీని చెట్టు కొమ్మతో పోలుస్తారు గదా?

ఆ పక్కకొచ్చిన ఉష తలెత్తి చూసేటప్పటికి కొమ్మకి కట్టిన ఆ చీరనీ, విప్పికొక్కెనికి వేలాడదీసిన తన గజ్జెల్నీ చప్పుడొచ్చేంత గట్టిగా ముద్దులు పెట్టుకుంటుంటే తననే ముద్దెట్టుకుంటున్నట్టు ఇదైపోతున్న ఆ ఉష ఒకటే మెలికలు తిరిగిపోతుంది.

పాడేరు అవతల అడవి మధ్యలో ఉన్న ఆ కొత్తపల్లి జలపాతాల బాక్‌గ్రౌండ్‌లో తీద్దామనుకున్న ఈ సీను ఈ అరకు ఫారెస్టు గెస్ట్‌హౌస్ వెనక తీసెయ్యాల్సిన పరిస్థితి. ఎందుకంటే ఈ లోయకి డెబ్భై ఆరు కిలో మీటర్ల దూరంలో ఉన్న ఆ కొత్తపల్లి జలపాతాల దగ్గర కెళ్తే ఈ ఒక్క సీను కూడా పూర్తవ్వదు. సర్లే ఏదో కాని చ్చేద్దాం అనిపించే పద్ధతిలో షూట్ మొదలెట్టి ఫినిష్ చేసేక రాత్రికా పిడబ్ల్యుఐ జగన్నాథంగారి క్వార్టర్స్‌కి షిఫ్టింగ్.

ఇంట్లో ఎవరూలేని ఆ చీకటి రాత్రి మంచం అంచుమీద కూర్చున్న ఆ ఉష, మంగళ మర్చిపోయి వెళ్లిన ఆ టేప్‌రికార్డర్ ఆన్ చేసింది.

నీవొకచోటా నేనొకచోటా
ఇదిలోకము పలికే తేలిక మాట
నీవున్న చోటే నేనున్నచోటు
దేవుని సాక్షిగ నువ్వూ నేను ఒకటేలే...

అంటూ వస్తున్న ఆ పాటని వింటున్న ఉష బయటినించి అప్పుడే వచ్చిన శివుణ్ని చూసి కూడా ఆపలేదా టేప్ రికార్డర్.

గుమ్మం దగ్గర నిలబడిపోయిన శివుడు తన కోసమే ఆ పాటని ప్లే చేస్తుంది ఉష అనుకుంటు న్నాడు.

అలా మోగుతున్న పాట ఆగిపోయింది... 'నా కళ్లల్లో కన్నీళ్లకి కరిగే నిన్ను ప్రేమిస్తున్నాను,' అనా రైలు పట్టాల దగ్గరన్నప్పుడు మంగళ రికార్డ్ చేసిన తన గొంతు విన్న శివుడు ఆ మాటాడేది తన గురించే అని అపార్థం చేసేసుకున్నాడు.

ఈ సీను అయ్యేటప్పటికి బాగా చలిరాత్రి అయ్యింది. గెస్ట్‌హౌస్ కెళ్లిన నాకు నిద్ర రావడంలేదు. ఆ గాలికొండపురం రైల్వేగేటు కథ గురించి ఆలోచనలు.

ఐపోలేదింకా...

south side books

Est. 1980
HYDERABAD BOOK TRUST

## APPEAL TO TELUGU DIASPORA

*The Hyderabad Book Trust, a not-for-profit collective, has, since 1980, inspired a few decades of Telugu readers with some of the finest literature, both from India and across the world. This was possible only with the support of readers like you. We are now responding to the changing circumstances with a new venture - an English imprint, SouthSide Books. This will enable you to share stories, narratives and discussions about your roots and heritage with your Indian-origin children and non-Indian friends. SouthSide Books is dedicated exclusively to material relating to and emanating out of the Telugu/Dakhni speaking states, including from Urdu, and shortly, from the other southern states of India. This, we believe, is the first English language imprint by a publishing house to focus on material pertaining to a particular linguistic region. While English language publications in India have made tremendous progress over the last couple of decades, there is still a discernible lacuna in the material available to readers interested in books pertaining to particular regional cultures and ethnicities. English has become the primary reading language for exponentially growing numbers of people in the Telugu/Dakhni speaking world. We now have the unusual situation where readers, especially younger people, are interested in good literature, both fiction and non-fiction, pertaining to their region, culture, and politics, but are unable to read fluently in their mother tongues. SouthSide Books will cater to this readership.*

***SouthSide Books'*** *first list will launch this month with a set of three books. These are:*




### Speaking Sandals: Madiga Tales

***Author:*** **Yendluri Sudhakar**
***Translator:*** **K. Purushotham** **Rs. 200**

Fascinating vignettes of Dalit folk-lore and oral history. When they first appeared in 1989, they were heralded as the first outpouring of the Madiga voice in Telugu literature. Writing with the imagery and cadence native to his community, the late professor Endluri Sudhakar's stories are told in an endearing style of visits to his village and reminiscing conversations with relatives and elders. He writes about origin myths, drummers, fierce fighters, skilled artisans, strong matriarchs and other fascinating characters. Underpinning the stories is a robust awareness of the constant re-negotiations of caste hierarchies.




## Forests, Blood and Survival: The Life and Times of Komaram Bheem

***Author:*** **Bhoopal**
***Translator:*** **P.A. Kumar** **Rs. 200**

Bhoopal Reddy animates the life and times of the legendary Gond rebel. Beautiful descriptions of life in a forest-dwelling community amidst nature are contrasted with the precarious nature of their existence and the ruthless exploitation they are subject to by outsiders and the state. Based on anecdotes and scant evidence Bhoopal Reddy re-imagines Komaram Bheem's fight and rebellion in a far more powerful and poignant way than the myths that surround this larger-than-life icon.

## East Wind: Stories from Kalinga-Andhra

***Author:*** **Sudhakar Unudurti** **Rs. 400**

Undurthi Sudhakar is in his home ground when telling stories from north-coastal Andhra Pradesh. With his deep knowledge of the region's culture, he sets his stories in specific historical situations and contexts. His stories span a long period from antiquity to the present day - from declining Buddhist viharas and bustling sea-ports of the first millennium to the days of the colonialists and zamindars and finally to the tragedies of the Naxalite revolt in Srikakulam. His characters, tragic and comic, are caught up in a society going through the throes of change. A vivid introduction to a part of India that is not well represented in literature.




## Our next set of offerings within the next few months will include-

### The Buddha in my Backyard

*Author:* **Rani Sarma**

A travelogue from the pen of a historian, The Buddha In My Backyard, is a spell-binding account of the monasteries and artefacts ranging from the time of the Buddha in her backyard of Visakhapatnam district. She dwells on the destruction that time, an apathetic state and a society ridden with ignorance of history, have wreaked on these rich remains that speak of a society and culture long past.

### 1948 Readings

1948 saw Operation Polo or Police Action as it is called - the Indian Army entering the sovereign state of Hyderabad and taking over its rule. While the actual military intervention saw minimal loss of lives, it caused a great rupture in the culture and politics of Hyderabad State, later, in truncated form, to become Andhra Pradesh, and even later, Telangana. The huge loss of lives and property before and after the Police Action that

Muslims experienced also led them to a devastating (to them) loss of spirit. The Communists who rapidly spread over Telangana's villages were crushed by the Police Action, while the nationalists crowed over the destruction of a sovereign state within the borders of India. Hyderabad Readings attempts to present these multiple voices to the readers in the form of extracts from rare books, articles, memoirs - letters even - to help the reader reconstruct history and view the problems of the present through history's lens.

## Gharana

*Author:* **S. Suresh**

The story spans over four generations of a group of people, both from north India and from the Dharwad region, who are involved in Hindusthani music- their personal lives, their issues with each other - and related to their passion for music. From being a student and a disciple, to giving concerts of their own and developing an original style, to trying to make a name for themselves in a highly competitive and politicised industry and to, finally, have students and disciples of their own, thus completing the circle and starting a new cycle.

### *What would we like you to do?*

Support this venture too by gifting our first set of three books at a mere 25$ to anyone, anywhere in the world by IndiaPost. You can pay Hyderabad Book Trust from an Indian account (UPI, NEFT, cheque)

Hyderabad Book Trust, savings account no. -

You can also pay us from abroad. Send us 1,000$ and get all our English imprint books free anywhere in the world for the next five years. Send us more and we will gratefully acknowledge you as a Telugu loyalist.





WWW.TECHINSURANCEINC.COM
YOUR EMPLOYEES HEALTH
OUR PROMISE
HEALTH INSURANCE FOR IT COMPANIES
BUSINESS INSURANCE
VISITORS INSURANCE
MURALI TALLURI
FOUNDER
+1 (512) 917 - 8686
murali@techinsuranceinc.com
TECH INSURANCE
AGENCY
EMPLOYEE BENEFITS & BUSINESS INSURANCE
(512) 917-8686
Fax:1-512-829-3488
Contact us:3000 Polar Ln, Unit#802
Cedar Park ,TX,78613

# చాగంటి తులసి కవితలు

## ఏకాంతం

పడుతూ ఉంటుంది
కిందా మీదా ఒంటరితనం
గతకాలపు
గతుకుల పచారులతో!

ఎత్తిపోస్తూ ఉంటుంది
ఒంటరితనం
గుండె చెలమల విషాదాన్ని
దోసిళ్లతో!

ఒంటరితనం
ఎండుటాకుల గలగల శ్రుతులను
ఎగరేస్తుంది ఏడుపుతో!

ఏకాంతం అవదు ఎప్పుడూ
ఆకురాలు కాలం
దాని మరో పేరు
భావి భావనల నిత్యవసంతం!

## రిలే రేసు

చావుని దూరంగా చూడ్డం
దగ్గరగా చూడ్డం
దగ్గరవాళ్లు దూరమై
ఏహ్యమైపోవడాన్ని చూడ్డం
మూడు వేటికవి వేరే వేరే!

మొదటిది పట్టదు మనసుకు
రెండవది
పట్టినా పట్టుమని
పదిరోజులు ఉండదు
చివరిది
బతుకు చివర అంచుల
కత్తుల కోతకు కొస వరకూ
ఊపిరి పోస్తూనే ఉంటుంది

మన ఊపిరి ఆగి మరొహరికి
రిలే రేసు కడ్డీని
అప్పజెప్పాల్సిందే!!



తెలుగు కథకి తూర్పుదిక్కుగా భాసిల్లిన ప్రముఖ కథారచయిత చాగంటి సోమయాజులు (చాసో) వారసత్వంగా రచనలు సాగిస్తోన్న కథారచయిత చాగంటి తులసి కథలు, కవితలు, వ్యాసాలు రాసారు. అనేక గ్రంథాలు హిందీ, తెలుగు భాషల్లోకి అనువాదం చేసారు. చాలాకాలం ఒరిస్సాలో హిందీ ప్రొఫెసర్‌గా పనిచేసి, ప్రస్తుతం విజయనగరంలో ఉంటున్నారు.

www.digitaltimes.co

# What's Next For You?



**Leverage Our Digital Marketing Expertise for Your Business Evolution With The times**

- Content Marketing
- Position 0 & Next Gen SEO
- Lead Gen to Door Knocks
- E-commerce Multiplication

Google Partner | facebook for business | Microsoft Gold Partner

DIGITAL TIMES

Encinitas, USA; Hyderabad & Bangalore, India | hello@digitaltimes.co
**+91 98480 16666 +1 424-253-0800**



శ్రీ అట్లూరి & జలపతి

# కలిసిరాని రీమేకులు... రీమిక్సులు

తెలుగు సినిమా ఇప్పుడు ఆస్కార్ విజేత. భారతీయ సినిమారంగంలో ఒక గొప్పఘట్టం చూశాం ఆర్ఆర్ఆర్ మూలంగా. ఆర్ఆర్ఆర్‌లోని 'నాటు నాటు' పాటకి ప్రపంచమే ఊగింది. కీరవాణి బాణీలతో తెలుగు సినిమాకు ఆస్కార్ బోణీ జరిగింది.

ఒకవైపు తెలుగు సినిమా పాట ఆస్కార్ రేంజ్‌కి వెళ్లగా, మరికొందరు మాత్రం ఇంకా మూసపద్ధతిలో ఉన్నారు.

కరోనా అనంతరం తెలుగు సినిమా పరిశ్రమ వ్యాపారం, మేకింగ్ పద్ధతులు మారాయి. నిజం చెప్పాలంటే ఇపుడు ఎలాంటి సినిమాలు జనం చూస్తారు అనే విషయంలో ఎవరికీ క్లారిటీ లేదు. కేజీఎఫ్, విక్రమ్, ఆర్ఆర్ఆర్ సినిమాల విజయాలను చూసి ఫుల్లుగా యాక్షన్ సినిమాల ట్రెండ్ నడుస్తోంది అని కొందరు ఫిల్మ్ మేకర్స్ అలాంటి పంథాలో వెళ్లారు. కానీ బొక్కబోర్లా పడ్డారు. కొన్ని కాన్సెప్ట్ సినిమాల విజయం చూసి కొందరు దర్శక, నిర్మాతలు ఆ పద్ధతిలో చూశారు కానీ అనుకున్న ఫలితం దక్కలేదు.

మలయాళ సినిమాలకు దేశమంతా క్రేజ్ ఉందని ఆ సినిమాల హక్కులు కొని రీమేక్‌లు చేశారు. అక్కడ మిశ్రమ స్పందన వచ్చింది. ఇప్పుడు కొందరు రీమిక్స్‌లపై పడ్డారు. పాత పాటలను రీమిక్స్ చేసి చూపించడం అనే ట్రెండ్ ఇప్పటిది కాదు. ఒక పది, పదిహేనేళ్ల క్రితం రీమేక్స్ సాంగ్‌లకు చాలా క్రేజ్ ఉండేది. కాలక్రమేణా వాటి జోరు తగ్గింది.

ఇప్పుడు మళ్లీ వాటికి ఊపు తెచ్చే ప్రయత్నం జరుగుతోంది. ఇటీవల కళ్యాణ్‌రామ్ ఈ ట్రెండ్‌కి మళ్లీ జీవం పోసినట్లు కనిపిస్తోంది..

రజనీకాంత్, గౌతమి జంటగా నటించిన ఒక తమిళ చిత్రం కోసం ఇళయరాజా 'మాసి మాసి' అనే డ్యూయెట్‌ని స్వరపరిచారు. అదే పాటని తెలుగులో కూడా అందించారు. బాలకృష్ణ, దివ్యభారతి నటించిన ధర్మక్షేత్రం సినిమాలో 'ఎన్నో రాత్రులొస్తాయిగానీ రాదే వెన్నెలమ్మా...' అనే పాట అదే. అద్భుతమైన ఈ గీతాన్ని వేటూరి రాశారు. ఎస్పీ బాలసుబ్రమణ్యం, చిత్ర పాడారు. అదే పాటని తాజాగా రీమిక్స్ చేసి గత నెలలో విడుదలైన అమిగోస్‌లో వాడారు.

తన బాబాయ్ పాటను కళ్యాణ్‌రామ్ రీమిక్స్ చేసి ఆ పాటలో హీరోయిన్ ఆషిక రంగనాథ్ డ్యాన్స్ చేశారు. అయితే, ఈ పాట కూడా ఆ సినిమాని కాపాడలేక పోయింది. సినిమా దారుణంగా పరాజయం చెందింది.

నితిన్ హీరోగా నటించిన మాచర్ల నియోజకవర్గం విషయంలో కూడా అదే సీన్ రిపీట్ అయింది. నితిన్ మొదటి చిత్రం జయం సినిమాలో ఒక సూపర్ హిట్ పాట ఉంది. అదే 'రాను రాను అంటూనే చిన్నదో...'



అనే పాట అప్పట్లో సూపర్ హిట్. అదే పాటని రీమిక్స్ చేశారు నితిన్ మాచర్ల నియోజకవర్గం సినిమాలో. సినిమాకి ఈ పాట హెల్ప్ కాలేదు. రీమిక్స్ పాట కూడా మిలియన్ల కొద్దీ వ్యూస్ తెచ్చుకొంది. ఫలితం అదే- ఢమాల్.

గల్లా కుటుంబం నుంచి వచ్చిన హీరో... అశోక్ గల్లా. మొదటి చిత్రం పేరు కూడా హీరో. ఈ సినిమాలో సూపర్‌స్టార్ కృష్ణ నటించిన 'జుంబారే జుజు జుంబారే...' పాటని రీమిక్స్ చేశారు. ఈ సినిమా సో సో అనిపించుకొంది.

## మలయాళ మేకులు

ఇక కరోనా అనంతరం రీమేకులు మేకులు అయి కూర్చున్నాయి. ఒకప్పుడు తమిళంలో హిట్టయిన ప్రతి సినిమా హక్కులు కొని రీమేక్ చేసేవారు. వెంకటేష్, పవన్‌కళ్యాణ్ ఎక్కువ శాతం రీమేక్ చిత్రాలు చేసి విజయాలు సాధించినవాళ్లే. ఇప్పుడు పాన్ ఇండియా ట్రెండ్ వచ్చింది. తమిళ పెద్ద చిత్రాలన్నీ అన్ని భాషల్లో విడుదల అవుతున్నాయి. పాన్ ఇండియా క్రేజ్‌ని మొదలుపెట్టిందే తెలుగువాళ్లు. దాంతో, తెలుగు సినిమాల రీమేకుల హక్కులు కొనేందుకు కూడా ఇతర భాషా నిర్మాతలు ముందుకు రావడంలేదు.

అయితే, తెలుగు చిత్రసీమలో కథల కొరత ఎక్కువగా ఉంది. అందుకే, తమిళ చిత్రాల బదులు మలయాళ సినిమాలవైపు మనవాళ్లు కన్నేశారు. అలా మలయాళ చిత్రాల రీమేకుల ట్రెండ్ ఎక్కువగా ఉంది ఇప్పుడు.

మలయాళ చిత్రాలు ఇటీవల దేశమంతా పేరు తెచ్చుకున్నాయి. భిన్నమైన కథలు, సహజమైన కథనాలతో సాగే ఆ సినిమాలు కరోనా కాలంలో ఓటిటిల ద్వారా చేరువయ్యాయి. దాంతో, మన సినిమా మేకర్స్ కూడా స్ఫూర్తి చెంది వాటి రీమేక్ హక్కులు తీసుకొన్నారు. అలా ఇటీవల విడుదలైన చిత్రాల సంఖ్య డజన్‌కి పైనే.

కరోనా తర్వాత పరిస్థితులు బాగుపడిన తర్వాత విడుదలైన పెద్ద చిత్రాల్లో మొదటి వరుసలో విడుదలైన సినిమా... భీమ్లానాయక్. ఈ సినిమా అయ్యపనం కోషియం అనే మలయాళ చిత్రానికి తెలుగు వర్షన్. ఆ మలయాళ చిత్రానికి జాతీయ అవార్డులు కూడా వచ్చాయి. తెలుగులో కావాల్సిన మార్పులు చేర్పులు దర్శకుడు త్రివిక్రమ్ దగ్గరుండి చేశారు. యువ దర్శకుడు సాగర్ చంద్ర చక్కగా డైరెక్ట్ చేశారు. దాంతో, మంచి టాక్ వచ్చింది. అయితే, సినిమా మాత్రం ఎబో యావరేజ్ లేదా హిట్ సినిమాగానే నిల్చింది. పెద్ద హిట్ కాలేదు.

మలయాళంలో ఘన విజయం సాధించిన లూసిఫెర్ చిత్రం మెగాస్టార్ చిరంజీవి నటించిన *గాడ్ ఫాదర్* చిత్రానికి ఆధారం. చిరంజీవి వయసుకు తగ్గ పాత్ర. సినిమాకి టాక్, రివ్యూస్ కూడా మంచిగానే వచ్చాయి. కానీ జనం మాత్రం రాలేదు. ఆచార్యలా అట్టర్ ఫ్లాప్ కాలేదు. అయితే, వాల్తేర్ వీరయ్య సాధించిన విజయంతో పోల్చితే *గాడ్ ఫాదర్* ఫలితం నథింగ్ అనే చెప్పాలి.

భీమ్లానాయక్, *గాడ్ ఫాదర్* చిత్రాలు పూర్తిగా మేకులు అని చెప్పలేం. కానీ, అవి కాసులపరంగా నిర్మాతలను సంతృప్తి చెయ్యలేదు.పెద్ద హీరోలు నటించని మలయాళ రీమేకులు మాత్రం మేకులై




కూర్చున్నాయి. బుట్టబొమ్మ అందుకు మంచి ఉదాహరణ. బుట్టబొమ్మ సినిమాకి కప్పేలా అనే మలయాళ చిత్రం ఆధారం. అక్కడ మంచి ప్రశంసలు, వసూళ్లు తెచ్చుకుందని రీమేక్ చేశారు. కానీ బుట్టబొమ్మ నీరసమైన ఓపెనింగ్స్, వసూళ్లతో నిర్మాతలని భయపెట్టింది.

దానికన్నా ఘోరమైన ఫలితం హంట్ చిత్రానికి దక్కింది. ఇందులో సుధీర్‌బాబు హీరో. ఓ పదేళ్ల క్రితం వచ్చిన మలయాళ చిత్రం కథని ఏరికోరి తెచ్చుకున్నారు సుధీర్‌బాబు. మలయాళంలో టాప్ హీరోల్లో ఒకరైన పృథ్వీరాజ్ నటించిన చిత్రం... ముంబై పోలీస్. 2013లో వచ్చిన ఆ సినిమాలో పెద్ద ట్విస్ట్... హీరో చివర్లో హోమో సెక్సువల్ అని తెలియడం. అప్పట్లో అది సంచలనం. తెలుగులో కూడా ఇప్పటివరకు ఏ హీరో 'గే'గా నటించలేదు కాబట్టి తాను ఆ సాహసం చేద్దామని ప్రయత్నించారు సుధీర్‌బాబు. అయినా, జనం ఆదరించలేదు.

శేఖర్ అంటూ రాజశేఖర్ తన వయసుకు తగ్గ పాత్రతో మన ముందుకొచ్చారు. నెరిసిన జుట్టు, తెల్ల గడ్డంతో కనిపించారు. కానీ, జనం మాత్రం ఆ సినిమా ముఖం చూడలేదు. ఇది కూడా మలయాళంలో మంచి విజయంతో పాటు ప్రశంసలు అందుకున్న జోసెఫ్ అనే చిత్రం ఆధారంగా రూపొందిందే.

ఇక మరో యువ హీరో తేజ సజ్జా నటించిన ఇష్క్ ఫలితం కూడా అంతే. మలయాళంలో అదే పేరుతో తీసిన సినిమాకి ఇది రీమేక్. తేజ సరసన ప్రియా వారియర్ నటించింది. కుర్రకారు మనసు దోచుకున్న ప్రియా నటించినా కూడా జనం ఈ సినిమాని చూడలేదు.

ఇలా కరోనా తర్వాత ఎన్నో మలయాళ రీమేకులు వచ్చాయి. ఏవీ కూడా బ్లాక్‌బస్టర్ ఫలితం అందుకోలేదు.

### ఇవి కూడా (రీ)మేకులే

మలయాళం నుంచి తీసుకున్న కథలే వర్కవుట్ కావడం లేదు అనుకుంటే పొరపాటు. ఇతర భాషల రీమేకులకు కూడా అదే గతి పట్టింది. గుర్తుందా శీతాకాలం సినిమాని ఒక కన్నడ చిత్రం ఆధారంగా తీశారు. లవ్ మాక్‌టైల్ అనే కన్నడ చిత్రాన్ని తెలుగులో సత్యదేవ్, తమన్నా జంటగా తెరకెక్కించారు. ఇది బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టింది. కనీసం ఓపెనింగ్ కూడా రాలేదు.

ఇక విశ్వక్‌సేన్ హీరోగా నటించిన ఓరి దేవుడా కూడా విజయం సాధించలేదు. ఇందులో వెంకటేష్ దేవుడిగా నటించారు. వెంకటేష్ ఉన్నా సినిమా ఆడ

లేదు అంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. తమిళంలో విజయం సాధించిన ఓ మై కడువలె సినిమాకిది రీమేక్.

దొంగలున్నారు జాగ్రత్త అంటూ ఆస్కార్ అవార్డు గ్రహీత కీరవాణి కుమారుడు సింహ కోడూరి నటించిన సినిమా ఒక్కరోజు కూడా ఆడలేదు. *44* అనే స్పానిష్ సినిమా దీనికి మాతృక.

శాకిని డాకిని అంటూ ఇద్దరు హీరోయిన్లు కలిసి యాక్షన్ కామెడీ మూవీ చేశారు. నివేత థామస్, రెజినా నటించిన ఈ సినిమా కొరియన్ చిత్రం మిడ్‌నైట్ రన్నర్స్ అనే సినిమాకి తెలుగు వర్షన్. కొరియన్ చిత్రం... ఇద్దరు యువకుల కథ. తెలుగులో యువతుల కథగా మార్చారు. కానీ మిస్ ఫైర్ అయింది.

ఊర్వశివో రాక్షసివో అంటూ అల్లు కుటుంబ హీరో వచ్చాడు. అల్లు శిరీష్, అను ఇమ్మాన్యూల్ జంటగా నటించిన ఈ సినిమా ఒక తమిళ చిత్రానికి రీమేక్. తెలుగులో కూడా బాగుంది. రివ్యూస్ కూడా ఓకే. అయినా ఈ సినిమా థియేటర్లలో ఆడలేదు.

ఇలా కరోనా అనంతర కాలంలో రీమేకులు తీసిన నిర్మాతలకు మేకులు అయి గుచ్చడమే తప్ప ఆనందంగా గిలిగింతలు పెట్టినవి లేవు.

బాగా చదువుకున్న వాళ్లు ఓటిటిలో ఇంగ్లీష్ సబ్ టైటిల్స్ పెట్టుకొని పరభాషాచిత్రాలను చూసి ఆనందిస్తున్నారు. ఇక రీసెంట్‌గా సబ్ టైటిల్స్ కూడా అవసరం లేకుండా ఓటిటి సంస్థలే తెలుగు భాషల్లోకి వాయిస్ డబ్ ఇచ్చి అందిస్తున్నాయి. దాంతో, ఇప్పుడు అందరూ అన్ని భాషల చిత్రాలను తెలుగు వాయిస్ పెట్టుకొని చూసేస్తున్నారు. దాంతో, రీమేక్ అంటే చాలు థియేటర్ వైపు కదలడం లేదు. కేవలం పవన్ కళ్యాణ్ లాంటి పెద్ద హీరో నటిస్తే... అభిమానులు మాత్రమే వెళ్తున్నారు. అందుకే, రీమేక్ చిత్రాలు పెద్దగా ఆడడం లేదు.









CURIE LEARNING
*learning with the leader ...*

# WE ARE LOOKING
## for FRANCHISEE PARTNERS

Curie Learning is a leading provider of customized after school learning programs for students Pre-K through high school.

**Our Programs:**

- K to Grade 7 Advanced Math & English program
- Specialized coaching for Magnet / Gifted and Talented School Entrance
- SAT / PSAT / ACT Specialized Coaching
- Creative English Writing
- Competitive Math Coaching
- S T E M Programs and other Academic Camps

### OTHER LOCATIONS

| | |
|---|---|
| Gainesville - VA | gainesville.va@curielearning.com |
| Ellicott City - MD | ellicottcity.md@curielearning.com |
| German Town - MD | germantown.md@curielearning.com |
| Edison - NJ | edison.nj@curielearning.com |
| Exton - PA | exton.pa@curielearning.com |
| Cumming - GA | curie.atlanta@gmail.com |
| Frisco - TX | frisco.tx@curielearning.com |
| Troy - MI | troy.mi@curielearning.com |
| Plymouth - MN | plymouth.mn@curielearning.com |
| Richmond - VA | richmond.va@curielearning.com |
| Apex - NC | apexcurie@gmail.com |
| Sunnyvale - CA | sunnyvale.ca@curielearning.com |

To know more about franchisee opportunity write to :

**rao@curielearing.com**

**or call on**

**703 582 0436 or 703 762 6120**

Corporate Centers

HERNDON.VA : herndon.va@curielearning.com
SOUTHRIDING.VA : southriding.va@curielearning.com
ASHBURN.VA : ashburn.va@curielearning.com

www.curielearning.com

**One stop solution for your child's academic needs...**